

RNI NO:TELTEL/ 2023/89546

# సూర్య రేఖ
తెలుగు దినపత్రిక

## విలేకరులు కావలెను


సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం
సంప్రదించవలసిన నెం : 9397303326

రంగారెడ్డి | సంపుటి : 3 | సంచిక : 170 | పేజీలు : 12 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | బుధవారం 29 అక్టోబర్ 2025 | వెల : 4/-

### జూబ్లీహిల్స్ బై పోల్‌కు
# సర్వం సిద్ధం

- 127 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు
- నియోజకవర్గం వ్యాప్తంగా 127 పోలింగ్ కేంద్రాల్లో 407 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు
- ఒక్కో పోలింగ్ బూత్‌కి నాలుగు చొప్పున 1,628 బ్యాలెట్ యూనిట్లను ఎన్నికల అధికారులు సిద్ధం
- ఉప ఎన్నికలో భాగంగా 509 కంట్రోల్ యూనిట్లు, 509 వీవీ ప్యాట్లు సిద్ధం




హైదరాబాద్
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ఎన్నికల అధికారులు సర్వం సిద్ధం చేశారు. నియోజకవర్గం వ్యాప్తంగా 127 పోలింగ్ కేంద్రాల్లో 407 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఒక్కో పోలింగ్ బూత్‌కి నాలుగు చొప్పున 1,628 బ్యాలెట్ యూనిట్లను ఎన్నికల అధికారులు సిద్ధం చేశారు. అదనంగా 20 శాతం బ్యాలెట్ యూనిట్లను సిద్ధంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఉప ఎన్నికలో భాగంగా 509 కంట్రోల్ యూనిట్లు, 509 వీవీ ప్యాట్లు సిద్ధం చేశారు. ఇప్పటికే ఈవీఎంల ర్యాండమైజేషన్ - మిగతా3లో



### ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరంగా
## పాకిస్థాన్‌లోని లాహోర్

- నగరంలో 329గా నమోదైన ప్రమాదకర ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్
- కాలుష్య నగరాల జాబితాలో మూడో స్థానంలో కరాచీ
- పంజాబ్ ప్రావిన్స్ వ్యాప్తంగా నెలకొన్న ప్రజారోగ్య సంక్షోభం
- తీవ్ర ఆరోగ్య సమస్యలు తప్పవని హెచ్చరిస్తున్న నిపుణులు
- ఇళ్లకే పరిమితం కావాలని ప్రజలకు అధికారుల సూచన

### అన్ని డ్యామ్‌లపై స్టేటస్ రిపోర్ట్
# తయారు చేయాలి



- సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల పరిస్థితిపై సీఎం సమీక్ష..
- శ్రీపాద ఎల్లంపల్లికి నీటిని తీసుకువచ్చేందుకు అవసరమైన ప్రణాళికలు, అంచనాలు సిద్ధం చేయాలి
- తుమ్మిడిహట్టిపై ఏ విధంగా ముందుకెళ్లాలనే అంశంపై అధికారులకు పలు సూచనలు
- బ్యారేజీల రిపేర్లకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలి
- ఇందుకు సంబంధిత ఏజెన్సీలే బాధ్యత వహించేలా చూడాలి

హైదరాబాద్
తుమ్మిడిహట్టి దగ్గర చేపట్టాల్సిన ప్రాజెక్టుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం రాష్ట్ర సచివాలయం లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో అధికారు లకి సీఎం పలు కీలక సూచనలు చేశారు. తుమ్మిడిహట్టి నుంచి సుందిళ్ల వరకు 80టీఎంసీల నీటిని తరలించేందుకు.. ప్రణాళి కలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగు, తాగు నీరు అందించాలని మార్గనిర్దేశం చేశారు. తుమ్మిడిహట్టి దగ్గర పాత పనులను ఉపయోగించుకుంటూ.. అంచనాలను తయారు చేయాలని సీఎం - మిగతా3లో



### తీరానికి చేరువవుతున్న మొంథా..
### భారత రైల్వే శాఖ అప్రమత్తం

- తుఫాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రైల్వే శాఖ సర్వసన్నద్ధంగా ఉండాలి
- తుఫాను పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలి

### హైదరాబాద్‌కు
# హాలీవుడ్‌ను రప్పిస్తాం



- సినీ టికెట్ ధరల పెంపుపై సీఎం రేవంత్ కీలక వాఖ్యలు
- హైదరాబాద్ నగరం ప్రపంచ సినీ పరిశ్రమకు వేదిక కావాలి: సీఎం రేవంత్
- సినీ కార్మికుల పిల్లల కోసం కార్పొరేట్ స్థాయి పాఠశాలలు నిర్మిస్తా
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో నవీన్ యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి
- 'హాలీవుడ్ సినిమాలు రామోజీ ఫిల్మ్‌సిటీలో, హైదరాబాద్‌లో.. షూటింగ్‌లు జరిగేలా బాధ్యత తీసుకుంటాం
- సినీ కార్మికుల కోసం ప్రభుత్వం తరపున చేయగలిగిన పనులు చేస్తా.

హైదరాబాద్
భారత్ ఫ్యూచర్ సిటీలో సినీపరిశ్రమకు ప్రాధాన్యం ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. సినీ కార్మికుల పిల్లల కోసం కార్పొరేట్ స్థాయి పాఠశాలలు నిర్మిస్తానని ఉద్ఘాటించారు. సినీ కార్మికుల పిల్లలకి ఉచితంగా చదువు చెప్పిస్తామని నొక్కిచెప్పారు. సోమవారం) యూసుఫ్‌గూడ పోలీస్ గ్రౌండ్‌లో సినీ కార్మికుల సమాఖ్య ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి సన్మాన సభ జరిగింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డిని సినీ ప్రముఖులు సన్మానిం చారు. సీఎం రేవంత్‌రెడ్డి సన్మాన సభకు సినీ ప్రముఖులు భారీగా తరలివచ్చారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో - మిగతా3లో



### ప్రతీ ఇంటికి ఒక ప్రభుత్వ ఉద్యోగం

- ఇక జీవిక పథకం కింద ఉన్న వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు
- గ్రామీణ మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి నాయకత్వం వహించే మహిళల కోసం జీవిక అనే పథకం అమలు
- దీనికింద పని చేసేవారిని ప్రభుత్వ ఉద్యోగిగా గుర్తింపు

### మొంథా ఎఫెక్ట్..
### తెలంగాణలో మూడురోజులు
# భారీ వర్షాలు

- ఈ జిల్లాలకు రెడ్ అలెర్ట్..!
- ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశాలు
- గంటకు 90 నుంచి 100 కిలోమీటర్ల ప్రపంచవేగంతో గాలులు



హైదరాబాద్
బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర తుపాను మొథా ప్రభావంతో తెలంగాణలో రాగల మూడురోజులు భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులలతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వెల్లడించింది. మొంథా తుఫాను గడిచిన 6 గంటలుగా 15 కిలోమీటర్ల వేగంతో కదులుతున్నదని.. ప్రస్తుతం ఏపీలోని మచిలీపట్నానికి 110 కిలోమీటర్లు, కాకినాడకు 190, విశాఖపట్నానికి 280 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమైందని చెప్పింది. ఈ రాత్రికి కాకినాడ తీరంలో తుపాను తీరం దాటే ఛాన్స్ ఉందని.. తీరం దాటే సమయంలో గంటకు 90 నుంచి 100 కిలోమీటర్ల ప్రపంచవేగంతో గాలులు వీస్తాయని వాతావరణశాఖ హెచ్చరించింది. మంగళవారం ములుగు, కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో అతిభారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ మూడు జిల్లాలకు వాతావరణశాఖ రెడ్ అలెర్ట్ - మిగతా3లో



## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త

- 8వ కేంద్ర వేతన సంఘం విధివిధానాలకు కేంద్ర కేబినెట్ ఆమోదం
- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు, పెన్షన్ల పెంపుపై సిఫార్సులు
- నియామకం జరిగిన 18 నెలల్లోగా కమిషన్ నివేదిక సమర్పణ
- దేశ ఆర్థిక పరిస్థితి, రాష్ట్రాలపై ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకోనున్న సంఘం
- సుమారు 50 లక్షల ఉద్యోగులు, 65 లక్షల మంది పెన్షనర్లకు ప్రయోజనం
- 2026 జనవరి 1 నుంచి సిఫార్సులు అమల్లోకి వచ్చే అవకాశం

# ప్రతీ ఇంటికి ఒక ప్రభుత్వ ఉద్యోగం

**పట్నా:** బిహార్‌లో మ్యానిఫెస్టో వేడి షురూ అయ్యింది. బిహార్ రాష్ట్రంలో ప్రతిపక్ష ఇండియా కూటమి మంగళవారం(అక్టోబర్ 28వ తేదీ) తమ మ్యానిఫెస్టోను ప్రకటించింది. ప్రతీ ఇంటికి ఒక ప్రభుత్వ ఉద్యోగం అనే అంశాన్ని మ్యానిఫెస్టోలు చేర్చింది. తాము గెలిస్తే ప్రతీ ఇంటికి ఒక ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని మహాఘట్ బంధన్(మహా కూటమి) సీఎం అభ్యర్థి, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ప్రకటించారు. ఈ మేరకు మ్యానిఫెస్టో విడుదల చేసిన ఆయన.. తమ కూటమి గెలిచిన పక్షంలో 20 రోజుల్లోపే ప్రతీ ఇంటికి ఒక ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని ప్రకటించారు. అదే అంశాన్ని మ్యానిఫెస్టోలో చేర్చామన్నారు. ఇక జీవిక పథకం కింద ఉన్న వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు ఇస్తామన్నారు. గ్రామీణ మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి నాయకత్వం వహించే మహిళల కోసం జీవిక అనే పథకం అమలు చేస్తున్నారు. దీనికింద పని చేసేవారిని ప్రభుత్వ ఉద్యోగిగా గుర్తింపు ఇస్తామన్నారు. కాగా, బిహార్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ రెండు విడతల్లో (నవంబర్ 6, 11) జరుగుతుంది. నవంబర్ 14న ఫలితాలు వస్తాయి.

**27 మంది తిరుగుబాటు నేతల బహిష్కరణ**

రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జేడీ) తాజాగా పార్టీ వ్యతిరేక కార్యకలాపాల ఆరోపణలపై 27 మంది నేతలను పార్టీ నుండి ఆరేళ్లపాటు బహిష్కరించింది. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయం నుండి వచ్చిన అధికారిక ప్రకటన ప్రకారం ఈ జాబితాలో వివిధ నియోజకవర్గాల్లో స్వతంత్ర అభ్యర్థులుగా పోటీకి దిగిన లేదా అధికారిక ఆర్‌జేడీ అభ్యర్థులను



వ్యతిరేకిస్తున్న నేతలు ఉన్నారు.

**20 నెలల్లోనే..**

నవంబర్‌లో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో రాజకీయ వేడి మరింతగా రాజుకుంటోంది. అధికార నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (ఎన్‌డీఏ)ప్రతిపక్ష మహాఘట్ బంధన్.. రెండూ కూడా పరస్పరం తీవ్ర విమర్శలు చేసుకుంటున్నాయి. అదే సమయంలో ప్రజలకు హామీలను కూడా గుప్పిస్తున్నాయి. రెండు రోజుల క్రితం పట్నాలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే కేవలం 20 నెలల్లో బీహార్‌ను నంబర్ వన్ చేస్తామని పేర్కొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఇది శుభవార్త. లక్షలాది మంది ఎదురుచూస్తున్న 8వ కేంద్ర వేతన సంఘం ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన మంగళవారం సమావేశమైన కేంద్ర కేబినెట్.. 8వ వేతన సంఘం ఏర్పాటుకు సంబంధించిన విధివిధానాలకు ఆమోదముద్ర వేసింది. దీంతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు, పెన్షనర్ల చెల్లింపుల పెంపుపై ఈ కమిషన్ త్వరలో తన పనిని ప్రారంభించనుంది.

ఈ నిర్ణయంతో దేశవ్యాప్తంగా సుమారు 50 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 65 లక్షల మందికి పైగా పెన్షనర్లకు లబ్ధి చేకూరనుంది. వేతన సంఘం ఒక తాత్కాలిక వ్యవస్థలా పనిచేస్తుంది. ఇందులో ఒక ఛైర్‌పర్సన్, ఒక పార్ట్‌టైమ్ సభ్యుడు, ఒక మెంబర్-సెక్రటరీ ఉంటారు. ఈ కమిషన్ తన నియామకం జరిగిన తేదీ నుంచి 18 నెలల్లోగా ప్రభుత్వానికి తన సిఫార్సులను సమర్పించాల్సి ఉంటుంది. అవసరమైతే, తుది సిఫార్సులకు ముందే మధ్యంతర



నివేదికలు కూడా ఇచ్చే వెసులుబాటును కల్పించారు. సిఫార్సులు చేసేటప్పుడు కమిషన్ పలు కీలక అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని కేబినెట్ నిర్దేశించింది. దేశ ఆర్థిక పరిస్థితి, ఆర్థిక క్రమశిక్షణ ఆవశ్యకత, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు నిధుల లభ్యత వంటి అంశాలను పరిశీలించనుంది. అలాగే, ఈ సిఫార్సుల ప్రభావం రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక వ్యవస్థపై ఎలా ఉంటుందో కూడా అంచనా వేయనుంది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేట్ రంగంలోని ఉద్యోగుల జీతభత్యాలు, పని పరిస్థితులను కూడా దృష్టిలో ఉంచుకుని నివేదిక రూపొందించాల్సి ఉంటుంది. సాధారణంగా ప్రతి పదేళ్లకు ఒకసారి కేంద్ర ప్రభుత్వం వేతన సంఘాన్ని ఏర్పాటు చేస్తుంది. ఉద్యోగుల జీతభత్యాలు, పదవీ విరమణ ప్రయోజనాలు, ఇతర సేవా నిబంధనలను సమీక్షించి, వాటిలో మార్పులను సూచించడం ఈ కమిషన్ ప్రధాన విధి. ఈ క్రమంలో, 8వ వేతన సంఘం సిఫార్సులు 2026 జనవరి 1 నుంచి అమల్లోకి వస్తాయని అంచనా వేస్తున్నారు. 7వ వేతన సంఘాన్ని 2014 ఫిబ్రవరిలో ఏర్పాటు చేయగా, దాని సిఫార్సులను ప్రభుత్వం 2016 జనవరి నుంచి అమలు చేసిన విషయం తెలిసిందే. 8వ వేతన సంఘం ఏర్పాటుపై ప్రభుత్వం 2025 జనవరిలో ప్రకటన చేసింది. తాజాగా కేబినెట్ ఆమోదంతో ఈ ప్రక్రియ అధికారికంగా ముందుకు సాగనుంది.

# ఆరెస్సెస్ కార్యకలాపాలపై ఆంక్షలు..
# సిద్ధరామయ్య ప్రభుత్వానికి హైకోర్టులో చుక్కెదురు

**ఆరెస్సెస్ కార్యకలాపాలకు ముందస్తు అనుమతిని తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులు**

**రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులపై మధ్యంతర స్టే విధించిన హైకోర్టు**

**తదుపరి విచారణ 17వ తేదీకి వాయిదా**

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కార్యకలాపాల వ్యవహారంలో కర్ణాటక ప్రభుత్వానికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. రాష్ట్రంలో ఆరెస్సెస్ తదితర సంస్థల కార్యకలాపాలకు ముందస్తు అనుమతిని తప్పనిసరి చేస్తూ సిద్ధరామయ్య ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులపై హైకోర్టు మంగళవారం మధ్యంతర స్టే విధించింది. తదుపరి విచారణను హైకోర్టు సింగిల్ జడ్జి బెంచ్ నవంబర్ 17వ తేదీకి వాయిదా వేసింది. ఆరెస్సెస్ ఏర్పడి వందేళ్లయిన నేపథ్యంలో భారీస్థాయిలో కవాతులు నిర్వహించేందుకు రాష్ట్ర బీజేపీ నాయకులు సిద్ధమయ్యారు. ఈ తరుణంలో సిద్ధరామయ్య ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ప్రైవేటు సంస్థలు, సంఘాలు తమ కార్యకలాపాల కోసం ప్రభుత్వ మైదానాలు, రహదారులు, బహిరంగ ప్రదేశాలు, విద్యాసంస్థల ఆవరణలను వినియోగించుకోవాలంటే ముందస్తు అనుమతి తప్పనిసరి చేసింది. ఈ మేరకు అక్టోబర్ 18న కర్ణాటక ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉత్తర్వులను ఎవరైనా ఉల్లంఘిస్తే



చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం అన్ని జిల్లాల యంత్రాంగాలను ఆదేశించింది. అయితే రాష్ట్రంలో అరెస్సెస్‌ను నిషేధించే ఉద్దేశంతో సిద్ధరామయ్య ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని బీజేపీ ఆరోపిస్తోంది. ఈ క్రమంలోనే ప్రభుత్వ ఉత్తర్వులను సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది.

# ‘భజనలో.. గోల్డ్ మెడల్ నీకేపో!’

ఒకవేళ భజన అనే పోటీ గనుక ఒలింపిక్స్‌లో ఉండి ఉంటే.. పాకిస్తాన్‌కు కచ్చితంగా ఆ పోటీల్లో గోల్డ్ మెడల్ వచ్చి తీరేదేమో!. విన్నర్ పోడియంలో ఎవరికీ అందనంత ఎత్తులో ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఉండి ఉండేవారేమో!.. ఈ మాటలు అంటోంది ఆ దేశ మాజీ దౌత్యవేత్త హుస్సేన్ హక్కానీ. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ మరోసారి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై విపరీతమైన ప్రశంసలు గుప్పించాడు. కంబోడియా-థాయ్‌లాండ్ మధ్య తాజాగా కౌలాలంపూర్ ట్రంప్ సమక్షంలో శాంతి ఒప్పందం కుదరింది. ఈ నేపథ్యంలో.. శాంతి, స్థిరత్వానికి కృషి చేసే నాయకుండంటూ పాక్ ప్రధాని విపరీతమైన పొగడ్తలు గుప్పించారు. మొన్న గాజా శాంతి ప్రణాళిక.. ఇప్పుడేమో ఇది. మధ్యప్రాచ్యం, దక్షిణాసియాలో శాంతి కోసం ట్రంప్ చేసిన కృషి ప్రపంచాన్ని రక్షించింది. లక్షల మంది ప్రాణాలు



పోకుండా నిలబెట్టింది అని షెహబాజ్ పేర్కొన్నారు. దీనిపై పాకిస్తాన్ మాజీ అమెరికా రాయబారి హుస్సేన్ హక్కానీ, షెహబాజ్ షరీఫ్‌పై వ్యంగ్యంగా స్పందించారు. పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ట్రంప్‌ను పొగడటంలో ఒలింపిక్ గోల్డ్ మెడల్ గెలిచే స్థాయిలో ఉన్నారంటూ ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. ఫరీద్ జకారియా వ్యాఖ్యలను ఉటంకిస్తూ.. ‘ఇది ఒలింపిక్ క్రీడ అయితే, షరీఫ్ పోడియం మీద గోల్డ్ మెడల్‌తో నిలిచేవారు అని అన్నారు. ఈజిప్ట్‌లో జరిగిన గాజా శాంతి సదస్సులోనూ షరీఫ్ ట్రంప్‌ను విపరీతంగా పొడిగారు. ట్రంప్‌ను శాంతి పురుషుడిగా అభివర్ణిస్తూ నోబెల్ శాంతి బహుమతికి అర్హుడంటూ మాట్లాడారు. ఆ సమయంలో ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ చిత్రమైన హావభావాలు ప్రదర్శించడం విపరీతంగా వైరల్ అయ్యింది. షరీఫ్ మాటలతో కడుపు నిండిపోయిన ట్రంప్ ‘ఇక మాట్లాడేం లేదని, ఇంటికి వెళ్లిపోదాం’ అంటూ వ్యంగ్యంఆ స్పందించడం మరో కొసమెరుపు. అయితే షెహబాజ్ షరీఫ్ వ్యాఖ్యలను పాక్ పౌరులే భరించలేకపోయారు. అంతలా దిగజారి పొగడాల్సిన అవసరం ఏముందంటూ.. ప్రధానిని తిట్టిపోశారు కూడా.

## తీరానికి చేరువవుతున్న మొంథా..
## భారత రైల్వే శాఖ అప్రమత్తం



‘మొంథా’ తుఫాను ముంచుకొస్తుండటంతో భారత రైల్వే శాఖ అప్రమత్తమైంది. తక్షణ చర్యలు చేపట్టేందుకు వీలుగా తెలుగు రాష్ట్రాల్లో, ఒడిశాలో డివిజనల్ వార్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఉన్నతాధికారులను ఆదేశించారు. తుఫాను ప్రభావిత ప్రాంతాలైన దక్షిణ మధ్య రైల్వే, ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. తుఫాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రైల్వే శాఖ సర్వసన్నద్ధంగా ఉండాలని సూచించారు. ప్రత్యేకించి విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం డివిజన్ల పరిధిలో అవసరమైన యంత్రాలు, సామగ్రితోపాటు సిబ్బందిని తక్షణమే అందుబాటులో ఉంచాలన్నారు. తుఫాను వల్ల ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి తీసుకుంటున్న చర్యలపై అధికారుల నుంచి నివేదిక కోరారు. తుఫాను పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పష్టంచేశారు. అత్యవసర పరిస్థితులు తలెత్తితే తక్షణం స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. తుఫాను కారణంగా రైళ్ల రాకపోకలకు అంతరాయం కలుగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టిసారించాలని పేర్కొన్నారు.

## ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరంగా
## పాకిస్థాన్‌లోని లాహోర్



పాకిస్థాన్‌లోని లాహోర్ నగరం మరోసారి వాయు కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. మంగళవారం దట్టమైన పొగమంచు (స్మాగ్) నగరాన్ని కమ్మేయడంతో, ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరంగా నిలిచింది. స్విస్ ఎయిర్ క్వాలిటీ మానిటర్ ‘ఐక్యూఎయిర్’ ప్రకారం, మంగళవారం ఉదయం 9 గంటల సమయంలో లాహోర్ వాయు నాణ్యత సూచీ (ఏక్యూఐ) 329గా నమోదైంది. అంతకుముందు ఉదయం లాహోర్ ఏక్యూఐ 424 వద్ద ఉందని, ఆరోగ్యానికి అత్యంత హానికరమైన పీఎం 2.5 కణాల స్థాయి 287గా నమోదైందని పాకిస్థాన్ పత్రిక ‘ది న్యూస్ ఇంటర్నేషనల్’ నివేదించింది. లాహోర్‌తో పాటు, కరాచీ నగరం కూడా ప్రపంచంలోని అత్యంత కాలుష్య నగరాల జాబితాలో మూడో స్థానంలో నిలిచింది. ఇక్కడ ఏక్యూఐ 174గా రికార్డయింది. ఈ స్థాయిలో కాలుష్యానికి ఎక్కువసేపు గురికావడం వల్ల గుండె జబ్బులు, ఊపిరితిత్తుల క్యాన్సర్, స్ట్రోక్, దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులు వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. పాకిస్థాన్‌కు చెందిన ‘డాన్’ పత్రిక కథనం ప్రకారం, అల్లామా ఇక్బాల్ టౌన్‌లోని సిటీ స్కూల్ వద్ద ఏక్యూఐ 505గా నమోదయింది. ఇది అత్యవసర ఆరోగ్య హెచ్చరిక స్థాయికి సమానం. ఫౌజీ ఫర్టిలైజర్ పాకిస్థాన్ పరిశ్రమ వద్ద ఏక్యూఐ 525గా రికార్డవగా, ఈ ప్రాంతాల్లోని లక్షలాది మంది ప్రాణాంతకమైన గాలిని పీలుస్తున్నారని స్పష్టమవుతోంది. ఈ స్మాగ్ ఎమర్జెన్సీతో పంజాబ్ ప్రావిన్స్‌ను అప్రమత్తం చేశారు. ఫైసలాబాద్, ముల్తాన్ నగరాల్లో ఏక్యూఐ వరుసగా 439, 438గా నమోదైంది. దీంతో పంజాబ్‌లో ప్రజారోగ్య సంక్షోభం నెలకొంది. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, శ్వాసకోశ సమస్యలు ఉన్నవారు బయటకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ప్రతి ఏటా పొగమంచు, వాహన, పారిశ్రామిక కాలుష్యం, వ్యవసాయ వ్యర్థాలను కాల్చడం వల్ల లాహోర్‌లో ఈ విపత్తు పునరావృతమవుతోంది.

## ఘోర విమాన ప్రమాదం..
## 12మంది దుర్మరణం

**నైరోబి:** కెన్యాలో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో 12మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. మంగళవారం ఉదయం కెన్యాలోని క్వాలే కౌంటీలో విమానం కూలింది. పర్యాటకులతో ప్రయాణిస్తున్న విమానం డయాని నుండి మాసాయి మారాలో



కిచ్వా టెంబోకు బయలుదేరింది. అయితే బయలుదేరిన కొద్దిసేపటికే కూలిపోయింది. విమాన ప్రమాదాన్ని కెన్యా పౌర విమానయాన అథారిటీ (కేసీఏఏ) ధృవీకరించింది. ఈ మేరకు ఓ ప్రకటనను విడుదల చేసింది. ‘డయాని నుండి కిచ్వా టెంబోకు వెళుతున్న 5%-జజూ% రిజిస్ట్రేషన్ నంబర్ కలిగిన విమానం ఉదయం 8.30 గంటల సమయంలో కూలిపోయింది. విమానంలో 12మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రమాదానికి గల కారణాలు , దాని ప్రభావాన్ని నిర్ధారించేందుకు ప్రభుత్వ అధికారులు ప్రమాదం జరిగిన ప్రదేశానికి వెళ్లారు’ అని కెన్యా సివిల్ ఏవియేషన్ అథారిటీ ప్రకటనలో పేర్కొంది. పోలీసుల ప్రకారం.. విమాన ప్రమాదంలో మరణించిన 12 మంది ప్రయాణికులు పర్యాటకులని తేలింది. ప్రమాదానికి ఖచ్చితమైన కారణాన్ని పరిశీలించడానికి,దర్యాప్తు చేయడానికి ప్రభుత్వ సంస్థలు ఇప్పటికే సంఘటనా స్థలానికి చేరుకున్నాయని కేసీఏఏ డైరెక్టర్ ఎమిలే ఎన్.రావు తెలిపారు. ప్రమాదానికి ఖచ్చితమైన కారణం ఇంకా నిర్ధారించబడినప్పటికీ, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఈ విషాదం చోటు చేసుకుందని స్థానిక మీడియా కథనాలు వెలుగులోకి వచ్చాయి. ఉదయం నుండి, తీరప్రాంతం పొగమంచు, మేఘాలతో కప్పబడి ఉండటం వల్ల పైలట్ నియంత్రణ కోల్పోయి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తూ కథనాల్లో హైలెట్ చేశారు.

# ఎల్ అండ్ టీ స్వాధీనం వెనుక...

# బ్యాక్ డోర్ పాలిటిక్స్



**హైదరాబాద్ :** కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉండగా పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ఆర్థిక విధానాలపై తీవ్ర విమర్శలు చేసింది. గత ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాల కారణంగానే మిగులు బడ్జె ట్‌తో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని ఆరోపించింది. కానీ 2023 అసెంబ్లీ ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీ పరిపాలన.. తీసుకుంటున్న నిర్ణయాలు అటు రాజకీయ విశ్లేష కుల నుంచి, ఇటు ప్రజల నుంచి విమర్శలకు తావిస్తు న్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ధోరణి ఆర్థిక నియంత్రణ లేమి, రాజకీయ స్వార్థ ప్రయోజనాలకు అద్దం పడుతుంది. ఈ దిశగా హైదరాబాద్ మెట్రో రైల్ అంశంలో తెలంగాణ ప్రభు త్వం తాజాగా తీసుకున్న నిర్ణయం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇటీవలి వరకు లార్సెన్ అండ్ టుబ్రో (ఎల్అండ్‌టీ) ఆధ్వర్యంలో కొనసాగిన మెట్రో రైలు ప్రాజెక్టును ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది.దీంతో రాష్ట్ర ప్రజలపై సుమారు రూ. 30 వేల కోట్ల అప్పుల భారాన్ని మోపిందనే ఆరోపణలు వినిప స్తున్నాయి. అయితే మెట్రో రైల్ స్వాధీనం చేసుకోవడంతో పరోక్షంగా ప్రజలపై వేల కోట్ల అప్పుల భారాన్ని మోపిన ప్రభుత్వం త్వరలోనే ప్రత్యక్షంగా ప్రజల జేబులు గుల్ల చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇటీవల బస్సు ఛార్జీలు పెంచిన రేవంత్‌రెడ్డి సర్కార్, ప్రస్తు తం అనివార్యంగా మెట్రో టికెట్ ఛార్జీలను పెంచనున్నట్టు అధికార వర్గాల నుంచి సంకేతాలు వస్తున్నాయి.

2017లో పబ్లిక్- ప్రైవేట్ పార్టనర్‌షిప్(పీపీపీ) పద్ధతిలో ఒప్పందం కుదుర్చుకున్న ఎల్ అండ్ టీ మెట్రో రైల్ ఆపరేషన్లు చేపట్టింది. కానీ ఇప్పుడు ఆ ఒప్పందాన్ని రద్దు చేసి, ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవడం పట్ల అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదొక 'బ్యాక్‌డోర్ డీల్' అని పలువురు అభిప్రాయపడుతున్నారు. అయితే మెట్రో రైల్ నుంచి ఎల్ అండ్ టీ సంస్థను తప్పించడం ద్వారా ప్రజలపై వేల కోట్ల భారం తప్పదంటున్నారుప్రభుత్వం మొత్తం ప్రాజెక్ట్‌ను స్వాధీనం చేసుకుంటే భయంకర నష్టాలు తప్పవని, ప్రభుత్వం నిర్ణయం తీసుకునే ఒక వారం ముందే సూచించింది. కానీ ఆ హెచ్చరికలను ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. ఎల్ అండ్ టీ భారీ నష్టాల్లో ఉన్నప్పటికీ పెనాల్టీ లేకుండా ఒప్పందాన్ని ముందుగానే ముగించుకోవడమంటే కార్పొరేట్ సంస్థకు నష్టం రాకుండా ప్రభుత్వమే కాపాడిందని విజయక్రాంతి విమర్శించింది. ప్రజల సొమ్ముతో ప్రైవేట్ సంస్థలను కాపాడే కొత్త మోడల్ ఇది అని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నా రు. సచివాలయ అధికారుల సమాచారం ప్రకారం.. ఎల్ అండ్ టీ లాభాలు కరోనా తర్వాత కూలిపోయాయి. మెట్రో ప్రయాణికుల సంఖ్య కూడా కరోనా పరిస్థితి ముందు కంటే ప్రస్తుతం 30 శాతం తగ్గింది. పైగా కొత్త మార్గాల విస్తరణలో జాప్యం జరగడం, అధిక నిర్వహణ వ్యయాలు ఎల్ అండ్ టీ సంస్థను ఆర్థికంగా భయపెట్టాయి. మెట్రో ప్రాజెక్ట్‌లో ఎల్ అండ్ టీ పెట్టిన రూ. 14,000 కోట్ల ఈక్విటీ జాప్యం, భూసేకరణ వివాదాలు, టికెట్ ధరల పరిమితి కారణంగా క్రమంగా నష్టాలబాట మొదలైంది. 2025 మధ్య నాటికి సంస్థ నష్టాలు భరించలేమంటూ ప్రాజెక్ట్ నుంచి బయటకు రావడానికి ప్రభుత్వంతో సంప్రదింపులు మొదలుపెట్టింది. ఈ క్రమంలో అక్టోబర్ 18న కేబినెట్ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజా ఆస్తిని ప్రజలకే తిరిగి ఇవ్వడమంటూ ప్రాజెక్ట్ స్వాధీనం చేసుకుంది. కానీ ఒప్పందంలోని షరతులు పలు అనుమానాలకు దారితీస్తున్నాయి. ఎల్ అండ్ టీ లాభాలను తిరిగి వసూళ్లు, పనితీరు లోపాలపై జరిమానా వంటి అంశాలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి.దీంతో ఎల్ అండ్ టీ సంస్థ పెద్దగా నష్టమేమీ లేకుండా, పరిహారం కూడా తీసుకుని ప్రాజెక్టు నుంచి వైదొలగింది. ప్రభుత్వం మాత్రం మొత్తం నష్టాన్ని భరించేందుకు అంగీకరించింది. ఇది ప్రైవేట్ సంస్థల లాభాలకు ప్రజల డబ్బుతో రక్షణ కల్పించడమేనని, ఇది ఆ సంస్థకు ప్రభుత్వమే ఇచ్చిన గోల్డెన్ ఎగ్జిట్ అని విశ్లేషకులు చెబుతున్నారు.

**మెట్రో నష్టం.. ప్రజలపై భారం...**

రవాణా శాఖ అధికారుల సమాచారం ప్రకారం జీహెచ్ఎంసీ ఎన్నికల తర్వాత ప్రజలకు ప్రభుత్వం భారీ షాక్ ఇవ్వనున్నట్టు తెలుస్తోంది. ఇప్పటివరకు రూ.10-60 మ ధ్య ఉన్న మెట్రో ఛార్జీలు డిసెంబర్ నాటికి 50- 100 శాతం పెరగవచ్చని సమాచారం. దీం తో 10 కిలోమీటర్ల ప్రయాణం ఇప్పటి రూ. 40 నుంచి నేరుగా రూ. 80కు ఎగబాకే అవకాశం ఉంది. మెట్రోలో రోజూ ప్రయాణించే 5 లక్షల ప్రయాణికులకు ఇది పెద్ద దెబ్బగా మారుతుంది.రోజువారీ కూలీలు, విద్యార్థులు, ఐటీ ఉద్యోగులందరూ ఈ భా రాన్ని మోయాల్సిందే. 'ద్రవ్యోల్బణం పేరిట సెప్టెంబర్‌లో ఇప్పటికే బస్సు ఛార్జీలు 25 శాతం పెం చారు. ఇప్పుడు మెట్రో కూడా పెంచితే మే మేం చేయాల'ని ఒక ప్రయాణికురాలు ఆగ్రహం వ్యక్తంచేశారు. ధనవం తుల రక్షణ కో సం పేదల జేబులు కొల్లగొడుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నా యి. 2023లో ఎన్నికల సమయంలో 'ప్రభుత్వానికి ప్రజలే ముఖ్యం..అని అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు అదే ప్రజలపై మెట్రో అప్పుల భారం మోపుతున్నారని విమర్శకులు చెబుతున్నారు. 69 కిలోమీటర్ల పొడవైన మెట్రో ఫేజ్--1, ట్రాఫిక్ జామ్‌లతో ఉక్కిరిబిక్కిరవుతున్న నగరానికి ఊపిరి అందిం చాలనే లక్ష్యంతో ప్రారంభమైంది. కానీ ఎల్ అండ్ టీ నిర్వహణలో అది 'నష్టాల కేంద్రం'గా మారింది.కేసీఆర్ హయాం లో భూ స్కాంలు, కరోనా సమయంలో పనులు ఆగిపోవడంతో రూ.14,000 కోట్లు గా ప్రారంభమైన ప్రాజెక్ట్ వ్యయం, క్రమంగా రూ. 18,000 కోట్లకు ఎగబాకింది. పీపీపీ మోడల్‌ను 'ఇన్నోవేటివ్ సొల్యూషన్'గా మొ దట్లో కొనియాడినప్పటికీ వాస్తవానికి అదే ఈ ప్రాజెక్ట్‌ను కుదేలుచేసింది. ఎల్ అండ్ టీకి ఆదాయంలో 90 శాతం వాటా ఇస్తూ 'బ్రేక్ ఈవెన్' అయిన తర్వాత 70-30 నిష్పత్తిలో వాటా అనే షరతు పెట్టారు. కానీ ఆ బ్రే క్ ఈవెన్ అసలు రాలేదు. హైదరాబాద్ మెట్రో ప్రాజెక్ట్ స్వాధీనం చేసుకోవాలనే నిర్ణయం తెలంగాణ ప్రభుత్వానికి భారీ ఆర్థిక నష్టంగా మారబోతోందని నిపుణుల హెచ్చరిస్తున్నారు. ఈ టేకోవర్ ద్వారా ఎల్ అండ్ టీ సంస్థ నష్టాలను ప్రభుత్వం భరిస్తోంది. అయితే దీని ద్వారా రూ. 55 వేల కోట్ల నష్టం వాటిల్లుతుందని అంచనా కాగా, అదనంగా ఎల్ అండ్ టీ తీసుకున్న రూ. 13,000 కోట్ల రుణభారం కూడా ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వ భుజాలపై పడనుంది.దీనికి తోడు ఒప్పందం ముందుగానే రద్దు చేసుకున్నందుకుగాను ఎల్ అండ్ టీ సంస్థకు ప్రభుత్వం మరో రూ. 2,000 కోట్లు పరిహారంగా చెల్లించనుంది. మొత్తం మీద, మొదటి దశలోనే రూ. 70 వేల కోట్లకు పైగా భారమని అధికారులు వెల్లడిస్తున్నారు. కానీ ఈ నష్టం ఇంతటితో ఆగదని, ప్రాజెక్ట్ నిర్వహణ, సంరక్షణ, వడ్డీ చెల్లింపులు, ఖర్చులు కలిపి రాబోయే 40 ఏళ్లలో అదనంగా మరో రూ. 50 వేల కోట్లకు పైగా భారమయ్యే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. దీనిని ఒక తరం ప్రజలపై నెమ్మదిగా అమలయ్యే ఆర్థిక దోపిడీగా విమర్శకులు అభివర్ణిస్తున్నారు. మెట్రో ప్రాజెక్టును స్వాధీనం చేసుకోవడం ద్వారా ఎదురయ్యే ఆర్థిక ప్రతికూలతలు తక్షణమే కనిపిస్తున్నాయి. మెట్రో రైళ్లు కొనసాగించడమే కాకుండా, ఓల్డ్ సిటీ, శంషాబాద్ వరకు ఫేజ్--2 విస్తరణకు కావాల్సిన నిధుల కోసం ప్రభుత్వం 2026 నాటికి మరో రూ. 15,000 కోట్లు అప్పు తీసుకోవాల్సి వస్తుంది. కానీ ఇక్కడే అసలు సమస్య ఉంది. ఎల్ అండ్ టీ తన ఏఏఏ క్రెడిట్ రేటింగ్, బ్రాండ్ వాల్యూతో కేవలం 6.5 శాతం వడ్డీతోనే రుణాలు పొందేది.కానీ ఇప్పటికే రూ. 3 లక్షల కోట్లకు చేరుకున్న రాష్ట్ర అప్పులు కారణంగా బ్యాంకులు ఇప్పుడు 11 శాతం వడ్డీని ప్రభుత్వం నుంచి డిమాండ్ చేస్తున్నాయి. వడ్డీ రేటులో ఉన్న 4.5 శాతం తేడాతో ప్రతి ఏడాది రాష్ట్ర ఖజానా నుంచి రూ. 700 కోట్లు అదనపు వడ్డీగా చెల్లించాల్సి ఉంటుంది. అయితే లోపాలున్నప్పటికీ ఎల్ అండ్ టీ సంస్థలో మెట్రో రైల్ నిర్వహణ వ్యవస్థను సాంకేతికత ఆధారంగా, క్రమపద్ధతిలో, తక్కువ సిబ్బందితో నడిచేది.కానీ ఇప్పుడు ప్రభుత్వ ఆధీనంలోకి రావడంతో పాలన ఆలస్యం, అధికారుల జోక్యం వంటి అంశాలు నిర్వహణను మరింత కష్టతరం చేస్తాయని నిపుణుల అంచనా వేస్తున్నారు. ప్రాథమిక ఆడిట్ నివేదికల ప్రకారం.. ప్రభుత్వ నిర్వహణలో 20-25 శాతం అదనంగా నిర్వహణ నష్టం వాటిల్లుతుందని స్పష్టమవుతున్నది. అంటే ప్రతి ఏడాది రూ. 1,500 కోట్ల నష్టం వస్తుంది. కానీ మెట్రో ఆదాయం మాత్రం రూ. 800 కోట్ల వద్దే స్థిరంగా ఉంది. జీహెచ్ఎంసీ ఎన్నికలు నవంబర్ 2025లో జరగనున్న తరుణం లో ఈ టేకోవర్ ప్రకటించడం రాజకీయంగా పెద్ద వ్యూహం అని విశ్లేష కులు అంటున్నారు. నాయకత్వం బలంగా ఉందనే మేజెస్ ఇవ్వడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నా రు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఓట్లు వేసిన తర్వాత టికెట్ ధరల పెంపు నిర్ణయాన్ని వెల్లడించనున్నారు. కానీ ఓటర్లు మౌనంగా లేరు. సోషల్ మీ డియా అంతా మెట్రోస్కామ్ హ్యాష్‌ట్యాగ్‌లతో వైరల్ అవుతున్నది. ఆర్థికంగా దెబ్బతిన్న రాష్ట్రంలో ఇది కేవలం ఒక ప్రాజెక్ట్ సమస్య కాదని, ప్రభుత్వ ఆర్థిక ప్రణాళికల వైఫల్యానికి ప్రతీక అని నిపుణులు అభిప్రా యపడుతున్నారు. ఇప్పటికే రాష్ట్ర అప్పు-జీఎస్‌డీపీ నిష్పత్తి 35 శాతం దాటే దశలో ఉంది. ఈ టేకోవర్ తరువాత ఆ నిష్పత్తి మరింత పెరుగుతుంది. సామాజిక సంక్షేమ పథ కాలకు కేటాయింపులు తగ్గిపోవడం, మెట్రోవిస్తరణ కలలు వాయిదా పడడం తప్పదని హెచ్చరిస్తున్నారు.మెట్రో ప్రాజెక్టు కింద ఇప్పుడున్న ఆస్తులు ఏమౌతాయోనన్న ఆందోళన కూడా నగరవాసుల్లో వ్యక్తమవు తున్నది. కానీ మరోవైపు ఎల్‌అండ్ టీ మాత్రం లాభపడింది. మెట్రో ప్రాజెక్టును ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని ప్రకటన వెలువడగానే ఎల్‌అండ్‌టీ కంపెనీ షేర్ విలు వ 2 శాతం పెరిగింది. దీనిని క్లీన్ ఎగ్జిట్ అని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

జీహెచ్ఎంసీ ఎన్నికల తర్వాత ప్రజలకు ప్రభుత్వం భారీ షాక్ ఇవ్వనున్నట్టు తెలుస్తోంది. ఇప్పటివరకు రూ. 10-60 మధ్య ఉన్న మెట్రో ఛార్జీలు డిసెంబర్ నాటికి 50-100 శాతం పెరగవచ్చని సమాచారం. దీంతో 10 కిలోమీటర్ల ప్రయాణం ఇప్పటి రూ. 40 నుంచి నేరుగా రూ. 80కు ఎగబాకే అవకాశం ఉంది. మెట్రోలో రోజూ ప్రయాణించే 5 లక్షల ప్రయాణికులకు ఇది పెద్ద దెబ్బగా మారుతుంది. రోజువారీ కూలీలు, విద్యార్థులు, ఐటీ ఉద్యోగులందరూ ఈ భారాన్ని మోయాల్సిందే.ద్రవ్యోల్బణం పేరిట, సెప్టెంబర్‌లో ఇప్పటికే బస్సు ఛార్జీలు 25 శాతం పెంచారు. ఇప్పుడు మెట్రో కూడా పెంచితే మేమేం చేయాల'ని ఒక ప్రయాణికురాలు ఆగ్రహం వ్యక్తంచేశారు. ధనవంతుల రక్షణ కోసం పేదల జేబులు కొల్లగొడుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.2023లో ఎన్నికల సమయంలో 'ప్రభుత్వానికి ప్రజలే ముఖ్యం.. అని అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు అదే ప్రజలపై మెట్రో అప్పుల భారం మోపుతున్నారని విమర్శకులు అంటున్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికలు నవంబర్ 2025లో జరగనున్న తరుణంలో ప్రభుత్వం మెట్రో టేకోవర్ ప్రకటించడం రాజకీయంగా పెద్ద వ్యూహం అని విశ్లేషకులు అంటున్నారు.

# వందల కోట్ల నుంచి 15 కోట్లకు... పడిపోయిన గులాబీ విరాళాలు



**హైదరాబాద్ :** బెంగాల్లో మమ తకు.. తమిళనాడులో స్టాలిన్ కు, ఏపీలో చంద్రబాబుకు.. అంతకు ముందు జగన్మోహన్ రెడ్డికి ఎవరికీ చేతకాలేదు. వాళ్ల వల్ల కా లేదు.. వాస్తవానికి కుటుంబ పార్టీలలో.. కనివిని ఎరుగని స్థాయిలో ట్రెండ్ సృష్టించారు కేసీఆర్. అధికారంలో ఉన్నప్పుడు తన పార్టీని ఏకంగా జాతీయస్థాయిలో నిలబెట్టాలని ప్రయత్నం చేశాడు. గాలి మోటార్ లో దేశ మొత్తం తిరిగాడు. అసలు ప్రతిపక్ష కూటమికి తానే ఫండింగ్ చేస్తానని చెప్పాడు. అటువంటి కెసిఆర్ ఇప్పుడు ఫామ్ హౌస్ కు పరిమిత మయ్యాడు. బిడ్డను పార్టీ నుంచి బయటికి పంపించాడు. అసెంబ్లీ ఎన్నికల్లో దారుణమైన ఫలితాలు.. పార్లమెంట్ ఎన్నికలు 0 ఫలితాలు.. అంతే ఇప్పుడు కారు పార్టీని దేకే వాడు లేడు. ఈ మాట అంటున్నది మేం కాదు. ఎన్నికల సంఘానికి స్వయంగా భారత రాష్ట్ర సమితి ఇచ్చిన రిపోర్టు.2023 -2024 కాలానికి భారత రాష్ట్ర సమితికి ఏకంగా 580.52 కోట్లు విరాళాల రూపంలో వచ్చాయి.. ఇందులో ఎలక్టోరల్ బాండ్ల ద్వారానే భారత రాష్ట్ర సమితికి 495.52 కోట్లు వచ్చాయి. ఇందులో ప్రడెంట్ ఎలక్టో రల్ ట్రస్టు ద్వారా ఏకంగా 85 కోట్లు లభించాయి. 2022 -23 సంవత్సరానికి సంబంధించి భారత రాష్ట్ర సమితికి 683.06 కోట్లు వచ్చాయి. ఇందులో బాండ్ల రూపంలో 529 కోట్లు, ఎలక్టోరల్ ట్రస్ట్ నుంచి 90 కోట్లు.. వివిధ వ్యక్తుల నుంచి 64.3 కోట్లు వచ్చాయి.అసెంబ్లీ ఎన్నికల్లో ఊహించని ఫలితాలు.. పార్లమెంట్ ఎన్నికల్లో 0 ఫలితాలు రావడంతో కారు పార్టీ పరిస్థితి దారుణంగా మారిపోయింది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత వచ్చిన ఉప ఎన్నికలో కారు పార్టీ దారుణంగా బోల్తా పడింది. దీనికి తోడు ఆ పార్టీ నుంచి కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత వెళ్లిపోయింది. ఈ క్రమంలో ఆ పార్టీని పెద్దగా పట్టించుకునే వారు లేకుండా పోయారు. 2024 -25 లో పార్టీకి 15,09,08,141 మాత్రమే వచ్చాయని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల చంద్రశేఖర్ రెడ్డి కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పించిన నివేదికలో పేర్కొన్నారు.. ఇప్పుడు గులాబీ పార్టీ అధికారంలో లేకపోవడంతో.. కాంట్రాక్టర్లు పట్టించుకోవడం లేదు. అజ్ఞాత వ్యక్తులు విరాళాలు ప్రకటించడం లేదు.. రాజ్యసభ సభ్యత్వం పొందినవారు.. ఇంకా అనేక రకాల మేళు ్ళ పొందినవారు పార్టీని పట్టించుకోవడం లేదు. అందువల్లే గులాబీ పార్టీకి విరాళాలు ఏకంగా 97 శాతానికి పడిపోయాయి.గులాబీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు విరాళాలు ఇవ్వడానికి కాంట్రాక్టర్లు పోటీపడ్డారు. నాయకులు కూడా పోటీపడ్డారు. దీంతో తిరుమల తిరుపతి దేవస్థానం హుండీ మాదిరిగా భారత రాష్ట్ర సమితి అధికారిక ఖాతా నిండుగా ఉండేది. నిత్యం డబ్బులు రాకతో కళ కళ లాడుతూ కనిపించేది. ఇప్పుడు అధికారం పోయిన తర్వాత కెసిఆర్ వ్యవసాయ క్షేత్రానికి పరిమితమయ్యారు. పార్టీ మొత్తం కేటీఆర్ చేతుల్లోకి వెళ్లిపోయింది. కల్వకుంట్ల కవిత బయటికి వెళ్లిపోయింది. ఒకవేళ ఇప్పుడు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గులాబీ పార్టీకి సానుకూల ఫలితం రాకపోతే పరిస్థితి మరో విధంగా ఉంటుంది.

## జూబ్లీహిల్స్ బై పోల్‌కు సర్వం సిద్ధం

-మొదటిపేజీ తరువాయి

పూర్తై పోయిందన్నారు. ఇక జూబ్లీహిల్స్ బై పోల్ నేపథ్యంలో నేడు నియోజకవర్గానికి కేంద్ర బలగాలు రానున్నాయి. ఏడు కంపెనీల కేంద్ర బలగాలతో పాటు 1600 మంది లోకల్ పోలీసులతో భారీ బందోబస్తు కల్పిస్తున్నారు. ఇప్పటి వరకు అభ్యర్థులు చేసిన ఖర్చుల రిజిస్టర్‌ను ఎన్నికల వ్యయ పరిశీలకులకు చూపించాలని ఆదేశించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతితో జూబ్లీహిల్స్‌లో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఇక బీఆర్ఎస్ తరపున ఆయన సతీమణి మాగంటి సునీత, కాంగ్రెస్ తరపున నవీన్ యాదవ్, బీజేపీ తరపున దీపక్ రెడ్డి బరిలో ఉన్నారు. నిరుద్యోగుల తరపున మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఆస్మా కూడా పోటీలో ఉన్నారు. నవంబర్ 11వ తేదీన ఉప ఎన్నికకు పోలింగ్ జరగనుంది.

## అన్ని డ్యామ్‌లపై స్టేటస్ రిపోర్ట్ తయారు చేయాలి

-మొదటిపేజీ తరువాయి

సూచించారు. సుందిళ్లకి రిపేర్ చేసి వినియోగంలోకి తీసుకొచ్చి శ్రీపాద ఎల్లంపల్లికి నీటిని తీసుకువచ్చేందుకు అవసరమైన ప్రణాళికలు, అంచనాలు సిద్ధం చేయాలని ఆజ్ఞాపించారు సీఎం రేవంత్‌రెడ్డి.

**సీఆర్ పాటిల్ లేఖపై చర్చ..**

అలాగే, కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల లేఖ రాశారు. ఈ లేఖపై ఈరోజు జరిగిన సమీక్షలో ఉన్నతాధికారులతో రేవంత్‌రెడ్డి చర్చించారు. సీఆర్ పాటిల్‌కి తాను రాసిన లేఖలో ప్రస్తావించిన అంశాలను అధికారులకు వివరించారు సీఎం. తుమ్మిడిహట్టిపై ఏ విధంగా ముందుకెళ్లాలనే అంశంపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ లేఖలో పేర్కొన్న ప్రాజెక్టులకు సంబంధించి ప్రాజెక్టుల వారీగా అధ్యయనం చేసి పూర్తిస్థాయి నివేదికలను తయారు చేయాలని అధికారులను ఆదేశించారు సీఎం రేవంత్‌రెడ్డి. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని డ్యామ్‌లపై స్టేటస్ రిపోర్ట్ తయారు చేయాలని సూచించారు. సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల పరిస్థితిపైనా సీఎం చర్చించారు. బ్యారేజీల రిపేర్లకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని, ఇందుకు సంబంధిత ఏజెన్సీలే బాధ్యత వహించేలా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆయా ప్రాజెక్టుల వారీగా పూర్తిస్థాయి నివేదికల ఆధారంగా తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై నవంబర్ రెండో వారంలో మరోసారి సమీక్షా సమావేశం నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు.

## మొంథా ఎఫెక్ట్..

## తెలంగాణలో మూడురోజులు భారీ వర్షాలు..

-మొదటిపేజీ తరువాయి

జారీ చేసింది. మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఆసిఫాబాద్, జగిత్యాల, కరీంనగర్, సిద్దిపేట, భువనగిరి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని పేర్కొంది. బుధవారం ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందంటూ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఆసిఫాబాద్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. గురువారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వివరించింది. గడిచిన 24గంటల్లో ఆసిఫాబాద్, సంగారెడ్డి, మెదక్, మంచిర్యాల, రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి, నల్గొండతో పాటు పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా యాదాద్రి జిల్లా చౌటుప్పల్‌లో 6.6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని టీజీడీపీఎస్ చెప్పింది.

## హాలీవుడ్‌ను హైదరాబాద్‌కు రప్పిస్తాం

-మొదటిపేజీ తరువాయి

నవీన్ యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ఒకప్పుడు తెలుగు పరిశ్రమ మదరాసి అని పిలిచేవారని చెప్పుకొచ్చారు. తెలుగు పరిశ్రమను హైదరాబాద్‌కు తరలించాలని.. ఆనాటి సీఎం మర్రి చెన్నారెడ్డి తీవ్ర కృషి చేశారని తెలిపారు. ఎన్టీఆర్, ఏఎన్నార్, కృష్ణ వంటి వారిని మర్రి చెన్నారెడ్డి సంప్రదించి హైదరాబాద్‌కు వచ్చేందుకు కృషి చేశారని ఉద్ఘాటించారు. చిత్రపురి కాలనీకి ప్రపంచస్థాయి గుర్తింపునకు ఆనాటి నాయకులు కృషి చేశారు చిత్రపరిశ్రమను ప్రోత్సహించాలని తక్కువ ధరకే స్టూడియోలకు భూములు ఇచ్చామని నొక్కిచెప్పారు. రామానాయుడు, పద్మాలయా, అన్నపూర్ణ స్టూడియోలకు అప్పటి సీఎంలు చౌకగా భూములు కేటాయించారని పేర్కొన్నారు సీఎం రేవంత్‌రెడ్డి.

**సినీ కార్మికుల శ్రమ, కష్టం నాకు తెలుసు..**

'కళాకారులను గౌరవించాలని 1964లో నంది అవార్డు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కళాకారులకు కావాల్సింది డబ్బు కాదు.. జనం కొట్టే చపట్లు.. కప్పే దుప్పట్లు. సినీ కార్మికుల శ్రమ, కష్టం నాకు తెలుసు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత పదేళు అవార్డులు ఇవ్వలేదు. మేము అధికారంలోకి వచ్చాక గద్దర్ పేరు మీద సినీ అవార్డులు ఇచ్చాం. హైదరాబాద్ నగరం ప్రపంచ సినీ పరిశ్రమకు వేదిక కావాలి అనేది నా సంకల్పం. ఐటీ, ఫార్మా పరిశ్రమలు ఎలాగో.. ఫిల్మ్ ఇండస్ట్రీకి కూడా అంతే. మీరు అండగా ఉంటే హాలీవుడ్‌ను హైదరాబాద్‌కు తీసుకువస్తా' అని సీఎం రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు.

**వెల్ఫేర్ ఫండ్ ఏర్పాటు..**

'హాలీవుడ్ సినిమాలు రామోజీ ఫిల్మ్‌సిటీలో, హైదరాబాద్‌లో.. షూటింగ్‌లు జరిగేలా బాధ్యత తీసుకుంటాం. సినీ కార్మికుల కోసం ప్రభుత్వం తరఫున చేయగలిగిన పనులు చేస్తా. సినీ కార్మికుల కోసం వెల్ఫేర్ ఫండ్ ఏర్పాటు చేస్తున్నాం. సినీ కార్మికుల వెల్ఫేర్ ఫండ్‌లో ప్రభుత్వ తరపున రూ.10 కోట్లు డిపాజిట్ చేస్తాం. సినిమా టికెట్లు పెంపు ద్వారా వచ్చిన ఆదాయంలో 20 శాతం కార్మికులకు ఇవ్వాలి. కార్మికులకు లాభాల్లో 20 శాతం ఇస్తేనే టికెట్ల ధరలు పెంచుకునేందుకు జీవో ఇస్తాం. సినీ కార్మికుల భవన్ నిర్మాణానికి స్థలం ఇస్తాం. త్వరలోనే సినీ కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇస్తాం. సినీ కార్మికుల అసోషియేషన్‌తో మాట్లాడి స్థలాలు ఇస్తాం. ఫైటర్స్, సినీ కార్మికుల ప్రాక్టీస్‌కు ఫ్యూచర్ సిటీలో ఏర్పాట్లు చేస్తాం. సినీ కార్మికుల సమస్యలు పరిష్కరించే బాధ్యత నాది. నవంబర్ చివరి వారంలో సినీ కార్మికులతో మాట్లాడతాం' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## లొంగిపోయిన మావోయిస్టు నేతలపై చర్యలు ఉండవు: డీజీపీ శివధర్‌రెడ్డి

**హైదరాబాద్:** పోలీసుల ఎదుట లొంగిపోయి, జనజీవన స్రవంతిలో కలిసిన మావోయిస్టులపై ఎలాంటి చర్యలు ఉండవని తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి స్పష్టం చేశారు. మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు బండ ప్రకాశ్‌తో కలిసి మరో కీలక నేత పుల్లూరి ప్రసాదరావు అలియాస్ చంద్రన్న తెలంగాణ డీజీపీ ఎదుట లొంగిపోయారు. మావోయిస్టుల లొంగుబాటు వివరాలను డీజీపీ మీడియా సమావేశంలో వెల్లడించారు. "1980లో పుల్లూరి ప్రసాదరావు కిషన్‌జీకి అనుచరుడిగా మారారు. 1981లో పీపుల్స్‌వార్‌లో చేరి.. 1983లో కమాండర్ అయ్యారు. 1992లో ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. 2008లో మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడయ్యారు. 17 ఏళ్ల పాటు మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడిగా ఉన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పిలుపుతో పుల్లూరి ప్రసాదరావు లొంగిపోయారు" అని డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. "మావోయిస్టు మరో నేత బండ ప్రకాశ్ అలియాస్ ప్రభాత్.. 45 ఏళ్లు వివిధ స్థాయిల్లో పనిచేశారు. అతని స్వస్థలం తెలంగాణలోని మందమర్రి. ఏడో తరగతి చదువుతున్నప్పుడే నక్సలిజం వైపు ఆకర్షితులయ్యారు. 2004లో జరిగిన శాంతి చర్చల్లో ప్రకాశ్ పాల్గొన్నారు. 2019లో స్టేట్ కమిటీ సభ్యుడయ్యారు. నేషనల్ పార్క్ ఏరియా కీలక ఆర్గనైజర్‌గా బాధ్యతలు నిర్వహించారు. బండ ప్రకాశ్‌పై ఉన్న రూ.20లక్షల రివార్డు ఆయనకు ఇస్తాం. పుల్లూరి ప్రసాదరావుపై ఉన్న రూ.25లక్షల రివార్డు ఆయనకు ఇస్తాం.

# బస్తీ దవాఖానాలతో పేదల చెంతకే వైద్యం






**ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చొరవ..**
**బస్తీ దవాఖానను ప్రారంభించిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్**

**రాజేంద్రనగర్,అక్టోబర్28(సూర్యరేఖ)**రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో మెరుగైటి వైద్య సేవలు అందించేందుకు బస్తీ దవాఖానాలు ఎంతగానో దోహదం చేస్తాయని రాజేంద్రనగర్ నియోజక వర్గం ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ అన్నారు. మంగళ వారం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బస్తీ దవాఖాన ప్రారంభోత్సవాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్పోరేషన్ పరిధిలో కిస్మత్ పూర్,దర్గాలో నూతనంగా ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానా రాజేంద్రనగర్ శాసనసభ్యులు ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి స్థానిక మాజీ కార్పొరేటర్లు అధికారులు,ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ...ప్రజల సమస్యల పరిష్కారానికి అన్ని విధాలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని వివరించారు. నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం బస్తీ దవఖానాలు ఏర్పాటు చేస్తోందన్నారు.ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు మరింత అందుబాటులోకి తీసుకురావాలనే ముఖ్యఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి బస్తీలో కాలనీలో బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేస్తుందని తెలిపారు. కిస్మత్ పూర్‌లోని దర్గాలో ఈ దవాఖానా ప్రారంభించడం ద్వారా ఈ ప్రాంత ప్రజలకు సాధారణ ఆరోగ్య సమస్యలకు ఉచితంగా నాణ్యమైన వైద్య సేవలు లభిస్తాయని పేర్కొన్నారు. ఈ దవాఖానాల్లో ఉచితంగా వైద్య పరీక్షలు మందుల పంపిణీతో పాటు పలు రకాల ఆరోగ్య సేవలు అందుబాటులో ఉంటాయని ప్రజలు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్



కార్పొరేషన్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని,మౌలిక వసతులతో పాటు వైద్యం,విద్య రంగాలకు ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, వైద్యాధికారులు,స్థానిక నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# గుడిమల్కాపూర్ మార్కెట్ ను మొయినాబాద్ అజిత్ నగర్ తరలిస్తాం

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**
**మర్యాదపూర్వకంగా మంత్రిని కలిసిన మార్కెట్ పాలకవర్గం..**

**గండిపేట్,అక్టోబర్28(సూర్యరేఖ)**గుడిమల్కాపూర్ మార్కెట్ ను మొయినాబాద్ మండలం అజీజ్ నగర్ కు తరలించి అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.గుడిమల్కాపూర్ మార్కెట్ చైర్మన్ మల్లేష్ ముదిరాజ్ తో పాటు పాలకవర్గం మంగళవారం మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ వివరాలను గండిపేటలో మంగళవారం సాయంత్రం చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్ మీడియాకు వెల్లడించారు.చైర్మన్ అధ్యక్షతన మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు మంత్రి తుమ్మలను కలవడం జరిగింది.మార్కెట్ అభివృద్ధి పనులు,వివిధ సమస్యల పరిష్కారం విషయమై ఆయనకు వివరించారు.స్పందించిన తుమ్మల అభివృద్ధికి అనువిధాలుగా సహకరిస్తానని హామీ ఇచ్చినట్లు చైర్మన్ మల్లేష్ ముదిరాజ్ తెలిపారు. త్వరలో మార్కెట్ ని



మొయినాబాద్ మండలంలోని అజీజ్ నగర్ కి తరలించేందుకు చర్యలు తీసుకుంటానని మంత్రి చెప్పారని పేర్కొన్నారు. భవిష్యత్తులో మంచి మార్కెట్ నిర్మించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కృషి చేస్తానని మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ మునీర్, శంకర్,మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హై సెక్యూరిటీ స్మార్ట్ హైవే... మీరు ఏఐ నిఘాలో ఉన్నారు

**హైదరాబాద్ :** దేశంలో అత్యంత రద్దీగా ఉండే రహదారుల్లో ఒకటైన హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారి త్వరలో 'హై సెక్యూరిటీ స్మార్ట్ హైవే'గా రూపుదిద్దుకోనుంది. ప్రస్తుతం ఉన్న నాలుగు వరుసల రోడ్డును ఆరు వరుసలుగా విస్తరించడంతోపాటు అత్యంత ఆధునిక సాంకేతికతతో డిజిటల్ రోడ్డుగా మార్చనున్నారు. తెలంగాణ పరిధిలోని మల్కాపూర్ అందోల్ మైసమ్మ ఆలయం వద్ద నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ కనకదుర్గమ్మ గుడి వరకు వరకు దాదాపు 231.32 కిలోమీటర్ల మేర ఈ విస్తరణ జరగనుంది.ఈ భారీ విస్తరణ ప్రాజెక్టు కోసం సుమారు రూ. 10,391.53 కోట్లు నిధులు అవసరమవుతాయని సమగ్ర ప్రాజెక్టు నివేదికలో అంచనా వేశారు. ఇందులో నిర్మాణ వ్యయం కోసం రూ. 6,775.47 కోట్లు, ఇతర అవసరాల కోసం రూ. 3,616.06 కోట్లు కేటాయించారు. డీపీఆర్ రూపకల్పన దాదాపు పూర్తికావడంతో, వచ్చే ఏడాది ఏప్రిల్ లేదా మే నెలలో పనులు ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి.రహదారి భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ఈ రోడ్డును పూర్తిస్థాయిలో స్మార్ట్ హైవేగా తీర్చిదిద్దనున్నారు. దీనికోసం హైవేపై ప్రతి కిలోమీటర్‌కు రెండు వైపులా ఒకటి చొప్పున మొత్తం 231 అత్యాధునిక 360 డిగ్రీల సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తారు. ఈ కెమెరాలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో అనుసంధానం చేస్తారు. స్పీడ్ డిటెక్షన్, రాంగ్ రూట్ వంటి నిబంధనల అతిక్రమణతో పాటు ప్రమాదాలు వంటివి జరిగితే వెంటనే లొకేషన్, కిలోమీటర్ నంబర్‌తో సహా వీడియో వివరాలను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు పంపుతాయి. దీని పర్యవేక్షణకు ప్రత్యేక మానిటరింగ్ కేంద్రాలను హైవేపై ఏర్పాటు చేస్తారు. ఈ వ్యవస్థను రాష్ట్ర పోలీసు, రవాణా శాఖకు అనుసంధానం చేయడం వల్ల రోడ్డుపై నిరంతరం 24 గంటలు నిఘా ఉంటుంది.ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నట్టు గుర్తించిన 38 చోట్ల ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేయనున్నారు. అలాగే 17 బ్లాక్‌స్పాట్‌ల వద్ద రోడ్ ఓవర్‌బ్రిడ్జిలు, అండర్‌పాస్‌లు నిర్మించనున్నారు. రహదారికి ఇరువైపులా వాహనాలు కిందికి పడిపోకుండా బారికేడ్లు ఏర్పాటు చేస్తారు. సోలార్ వీధి దీపాలు ఏర్పాటు చేయడంతోపాటు, వర్షపు నీటిని ఒడిసిపట్టేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు. భవిష్యత్తులో రోడ్డును తవ్వకుండా ఉండేందుకు వీలుగా మంచినీటి సరఫరా, గ్యాస్ పైప్‌లైన్లు, ఆప్టికల్ ఫైబర్ కేబుల్ లైన్లు వంటి అన్ని మౌలిక వసతులను నిర్మాణ సమయంలోనే ఏర్పాటు చేస్తున్నారు.ఈ స్మార్ట్ హైవే విస్తరణ వాణిజ్య, వ్యాపార కార్యకలాపాలకు గణనీయమైన



ఊతమివ్వనుంది. ఈ రహదారి దాదాపు 50 ఇండస్ట్రియల్ పార్కులు, 20 ఎకనామిక్ నోడ్స్, 4 నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ లకు అనుసంధానం కానుంది. ఇది రెండు మేజర్ రైల్వే స్టేషన్లు, రెండు విమానాశ్రయాలకు కూడా అనుసంధానంగా మారనుంది. ప్రస్తుతం ఈ రోడ్డుపై రోజుకు 43,742 వాహనాలు తిరుగుతుండగా.. 2048 నాటికి ఈ సంఖ్య 1,71,251కి పెరుగుతుందని అంచనా. ఈ ప్రాజెక్టు పూర్తయితే హైదరాబాద్ నుంచి విజయవాడకు ప్రయాణ సమయం గణనీయంగా తగ్గనుంది.

## సంపాదకీయం

# ప్రకృతి వైపరీత్యాలు విధ్వంసం

1971లో ఒడిషాను (అప్పటి ఒరిస్సా) అతలాకులం చేసిన తుఫాను, ప్రకృతి ప్రతాపానికి నిదర్శనంగా మిగిలింది. ఈ తుఫాను అత్యంత శక్తిమంతమైనదిగా పరిగణించబడుతుంది. అధిక వేగంతో వీచిన గాలులు, భారీ వర్షాలు, తీరప్రాంతాల్లో భారీ అలలు తీరని విధ్వంసాన్ని సృష్టించాయి. వేల మంది మృతి చెందగా, లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. వ్యవసాయ భూములు, ఇళ్ళు, మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. తీరప్రాంత వృక్షసంపద, జీవవైవిధ్యం తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఒడిషా ఆర్థిక వ్యవస్థ దెబ్బతిని, పునర్నిర్మాణానికి ఎంతో కాలం పట్టింది. ఆర్థిక నష్టం అంచనాకు అందనిది. 1971లో ఒడిషాను (అప్పటి ఒరిస్సా) అతలాకుతలం చేసిన తుఫాను భారత దేశంలో ప్రకృతి వైపరీత్యాల ప్రతాపాన్ని చాటిచెప్పింది. ఈ తీవ్ర తుఫాను వల్ల ఊహాతీత విధ్వంసం జరిగింది. తుఫాను ఉప్పెన ఒడిశా తీరంలోని లోతట్టు ప్రాంతాలను ముంచెత్తింది, 10,000 మందికి పైగా మరణించారు. 50,000 పశువులు చని పోయాయి. వందల వేల చెట్లు నేలకూలాయి. తుఫాను 800,000 కంటే ఎక్కువ ఇళ్లను ధ్వంసం చేసింది. రోజుల తరబడి కమ్యూనికేషన్లు, విద్యుత్ లైన్లు తెగిపోవడంతో విపత్తు వార్త బయటి ప్రపంచానికి అందకుండా చేశారు. వేలాదిమంది ప్రాణాలు కోల్పోయి, లక్షలాది ప్రజలు నిరాశ్రయులయ్యారు. ఈ తుఫానుతో భారీ వర్షాలు, 300 కి.మీ.ల వేగంతో వీచిన గాలులు, తీరప్రాంతాల్లో అతిపెద్ద అలలు తీరని విధ్వంసాన్ని సృష్టించాయి. వ్యవసాయ భూములు, ఇళ్ళు, తీరప్రాంతంలో ఉన్న వృక్ష సంపద, జీవవైవిధ్యం తీవ్రంగా నష్టపోయాయి. ఒడిషా ఆర్థిక వ్యవస్థ ఈ తుఫాను ప్రభావం నుంచి కోలుకోవడానికి సంవత్సరాల సమయం పట్టింది. ఈ సంఘటన అనంతరం, విపత్తుల నిర్వహణలో ముందస్తు చర్యలు, అవగాహన, పునర్నిర్మాణ ప్రణాళికలు ఎప్పటికప్పుడు ముమ్ముందుకు రావాల్సిన అవసరం స్పష్టమైంది. ప్రకృతి వైపరీత్యాలు అంటే ప్రకృతి సృష్టించే భారీ సంఘటనలు, ఇవి పర్యావరణాన్ని, జీవసారాన్ని, ప్రజల ఆస్తి, ప్రాణాల్ని ప్రభావితం చేస్తాయి. తుపానులు, వరదలు, భూకంపాలు, సునామీలు, కరువు, అగ్నిపర్వతాలు వంటి విపత్తులు మనకు పెద్ద ముప్పుగా నిలుస్తున్నాయి. ప్రకృతి వైపరీత్యాలు కాకుండా మానవ చర్యల వల్ల కూడా విపత్తులు సంభవిస్తాయి. ఉగ్రవాదం, యుద్ధాలు, అణు బాంబులు, పరిశ్రమల కాలుష్యం వంటి మానవ నిర్మిత విపత్తులు మన భద్రత, ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయి. ఇవి ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారడంతో పాటు, పర్యావరణాన్ని కూడా నాశనం చేస్తాయి. భారతదేశంలో ప్రకృతి వైపరీత్యాలు తరచూ సంభవిస్తూనే ఉన్నాయి. ప్రివెన్షన్ వెబ్ స్టాటిటిక్స్ ప్రకారం గత మూడున్నర దశాబ్దాల్లో భారత్‌లో దాదాపు 431 రకాల ప్రకృతి విపత్తులు సంభవించాయి. ఈ విపత్తుల వల్ల 1,43,000 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, 15 కోట్ల మందికి పైగా ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రభావానికి గురయ్యారు. ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం, ఈ విపత్తుల కారణంగా భారతదేశ జాతీయ ఆదాయంలో ఏటా సుమారు 2.25 శాతం నష్టం సంభవిస్తోంది. ఐక్యరాజ్య సమితి నివేదిక ప్రకారం, 20 సంవత్సరాల కాలంలో ప్రకృతి వైపరీత్యాలు భారతదేశంలో సుమారు 7,950 కోట్ల డాలర్ల నష్టాన్ని కలిగించాయి. ప్రకృతి విపత్తులను పూర్తిగా నివారించడం సాధ్యం కాకపోయినా, ముందస్తు సన్నాహాలు మరియు విపత్తు నిర్వహణ ద్వారా వాటి ప్రభావాన్ని తగ్గించవచ్చు. సహాయ చర్యలను మరింత సమర్థంగా అమలు చేయడానికి ప్రజలలో అవగాహన పెంపొందించాలి. విపత్తుల నిర్వహణ కోసం పౌర సమాజం, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ సంస్థలు కలిసి ముందడుగు వేయాలి. విపత్తులకు ముందుగానే పునరుద్ధరణ ప్రణాళికలు తయారు చేయడం, ప్రజలకు శిక్షణ ఇచ్చి అప్రమత్తం చేయడం వంటి చర్యలు అవసరం. ప్రపంచవ్యాప్తంగా కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సీఆర్‌జెడ్) నిబంధనలు ప్రకృతి పరిరక్షణకు అనేక విభాగాలను అమలు చేస్తుంది. 1991లో భారత ప్రభుత్వం ఈ నిబంధనలు అమలులోకి తెచ్చింది. ఈ నిబంధనలు తీరప్రాంతాలలో నిర్మాణం, పరిశ్రమలు వంటి కార్యక్రమాలకు నిరోధం కల్పిస్తాయి. కానీ, అభివృద్ధి పనుల పేరుతో మడ అడవులు, హరిత వనాలు వంటి ప్రకృతి వనరులను విచ్ఛిన్నం చేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం నిర్దిష్ట బడ్జెట్ కేటాయించి, నష్టం అంచనాలలో పౌర సమాజం, స్వచ్ఛంద సంస్థలను భాగస్వామ్యం చేయడం ద్వారా ప్రకృతి వనరులను కాపాడవచ్చు. ప్రకృతి వైపరీత్యాల ప్రభావాన్ని తగ్గించేందుకు విపత్తు నిర్వహణపై దృష్టి సారించాలి. తీరప్రాంతాలలోని మడ అడవులు, చిత్తడి నేలలు, హరిత వనాలను పునరుద్ధరించడానికి చర్యలు తీసుకోవాలి. ప్రకృతి వైపరీత్యాల నివారణకు తగిన నిధులను సమకూర్చడం, గ్రీన్ కవర్ ను పెంపొందించడం, జీవవైవిధ్యాన్ని కాపాడడం వంటి చర్యలు అత్యవసరం. ప్రకృతి వైపరీత్యాల పై అవగాహన అవసరం.

# కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు కోసం కాంగ్రెస్ ఇంటింటి ఎన్నికల ప్రచారం






మందముల పరమేశ్వర్ రెడ్డి

**జూబ్లీహిల్స్,అక్టోబర్28(సూర్యరేఖ)** జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహమత్ నగర్ డివిజన్ రహమత్ నగర్ లో కార్పొరేటర్ ఈఎన్ రెడ్డి,తో కలిసి ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలతో ఆత్మీయంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు తెలుసుకుంటూ...కాంగ్రెస్ ప్రజాపాలన ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వివరిస్తూ..ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ చేతి గుర్తు పైన ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పరమేశ్వర్ రెడ్డి కోరారు.తాము నిర్వహించిన ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు దాదాపు ఖరారు అయినట్లేనని వెల్లడించారు.పోటీ చేస్తున్న నవీన్ యాదవ్ ఇప్పుడు ప్రజల మధ్య ఉండే ప్రజల మనిషిని ప్రచారంలో ప్రజలు చెబుతున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిల్కా మధుసూదన్ రెడ్డి,జిహెచ్ఎంసి ఫ్లోర్ లీడర్ ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## పత్తి విక్రయించే రైతులు పత్తిలో మ్యాచర్ 8శాతం ఉండాలి..

వ్యవసాయశాఖ మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివరెడ్డి..




**నారాయణపేట,అక్టోబర్28(సూర్యరేఖ)**నారాయణపేట శాసన సభ్యురాలు డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి ఆదేశాల మేరకు పత్తి రైతులకు తెలియజేయడం ఏమనగా భీకరతుఫాన్ మోంథ ఉండడంతో పత్తి అమ్మడానికి వచ్చే రైతులు తడిసిన పత్తి తేకండి,ఒక వేళ తడిచినపత్తి ఉన్నట్లయితే వర్షా భావం తక్కువఅయిన తర్వాత దాన్ని ఆరబెట్టి మ్యాచర్ శాతం 8నుండి12 మధ్యలో ఉంటేనే తీసుకు రావాలని సదాశివరెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ...వానలు,చలికి పత్తిలో తేమ శాతం 20పైగా వస్తున్నాయి. మాయిశ్చర్ 8శాతం ఉంటేనే మద్దతు ధర రూ.8110 ఇస్తామని సీసీఐ అధికారులు చెబుతున్నారని,తేమ12శాతం మించకుండా ఉంటేనే కొంటామని చెబుతున్నారు.రైతులు పత్తి ఏరిన తర్వాత అరపెట్టి తీసుకొని రావాలని,అలాగే వడ్ల కొనుగోళ్లలోనూ తేమ శాతం ఎక్కువ వస్తుందని, రైతులు అమ్మడానికి తెచ్చి పరేషాన్ అవుతున్నారు.ఎఫ్ సిఐ నిబంధనల ప్రకారం వడ్లు17 శాతం లోపు తేమ ఉంటేనే ఖరీదు చేస్తారు.పత్తిలో తేమ ఎక్కువ ఉన్న అమ్మడానికి తెచ్చి,ఇప్పటికే రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారు.మన నారాయణపేట జిల్లాలో తుఫాన్ ప్రభావం ఐదు రోజుల వరకు ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది.ఏల్లో హలర్ట్ జారి చేసింది.కావున రైతులు బయ భ్రాంతులకు చెందకుండ,తగు జాగ్రత్తలు తీసుకోవాలి.మీరు అమ్మడానికి తెచ్చి ఇబ్బందులు పడకండని వర్షాలు తగ్గు ముఖం పడ్డాక పత్తిని అరబెట్టి తేమశాతం 8నుండి12 మధ్యలో ఉంటేనే తీసుకొని రావాలని నారాయణపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ సదాశివరెడ్డి రైతులను కోరారు.

# మొంథా తుపాను..శంషాబాద్ నుంచి ఏపీకి వెళ్లాల్సిన18 విమానాలు రద్దు




**శంషాబాద్,అక్టోబర్28(సూర్యరేఖ)** మొంథా తుపాను ప్రభావం నేపథ్యంలో శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లాల్సిన18 విమానాలు రద్దు అయ్యాయి.వాతావరణం అనుకూలించని కారణంగా శంషాబాద్ నుంచి విజయవాడ,విశాఖ,రాజమండ్రికి వెళ్లాల్సిన విమానాలను రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. విజయవాడ విశాఖ రాజమండ్రి నుంచి శంషాబాద్‌కు రావాల్సిన విమానాలు కూడా రద్దు అయ్యాయి.మొంథా తుపాను కారణంగా విమాన సర్వీసులను రద్దు చేసినట్లు అధికారులు ప్రకటించారు.ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్,ఇండిగో విమానాలను రద్దు చేశారు.ఈ క్రమంలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.మొంథా తుపాను కారణంగా ఏపీలోని పలు జిల్లాల్లో భారీగా ఈదురుగాలులు వీస్తున్నాయి.పరిస్థితి అల్లకల్లోలంగా ఉంది. అక్కడక్కడ భారీ వృక్షాలు నేలకూలాయి. పలు రోడ్లు ధ్వంసం అయ్యాయి.

# రాజేంద్రనగర్‌లో ఇండిగో ఎయిర్‌హోస్టెస్ ఆత్మహత్య





**రాజేంద్రనగర్,అక్టోబర్28(సూర్యరేఖ)**రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎయిర్‌హోస్టెస్ ఆత్మహత్య చేసుకున్నారు.ఇండిగో విమానయాన సంస్థకు చెందిన ఎయిర్హోస్టెస్ జాహ్నవి తన గదిలో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ సంఘటన అక్టోబర్ 24న రాజేంద్రనగర్ సర్కిల్ శివరాంపల్లిలోని ప్రొవిడెంట్ (కెన్వార్త్) అపార్ట్మెంట్లో జరిగినప్పటికీ ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మృతురాలిని జమ్మూకు చెందిన జాహ్నవిగుప్తాగా గుర్తించారు.సంఘటన జరిగిన సమయంలో జాహ్నవిగుప్తాతో పాటు ఇద్దరు సహోద్యోగులు, మరొక స్నేహితుడు ఉన్నారు.రాజేంద్రనగర్ శివరాంపల్లిలోని ప్రొవిడెంట్ (కెన్వార్త్)అపార్ట్మెంట్లో జాహ్నవి రాత్రి స్నేహితులకుతో కలిసి పార్టీ చేసుకున్నట్లు సమాచారం.ప్రాథమిక దర్యాప్తు ప్రకారం... ఇండిగోలో కెప్టెన్‌గా పనిచేస్తున్న మహిళ స్నేహితురాలిలో ఒకరు ఫ్లాట్‌లో ఉన్నారని తెలిసింది.ఆ బృందం రాజేంద్రనగర్ ప్రొవిడెంట్ (కెన్వార్త్)అపార్ట్మెంట్,లోని ఫ్లాట్‌లో పార్టీ చేసుకున్నారు. తరువాత తన గదికి వెళ్లిన ఆమె ఉరివేసుకుని కనిపించింది.ఈ సంఘటన తర్వాత ఆమెను ఆసుపత్రికి తరలించినప్పటికీ,జాహ్నవి మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. జాహ్నవి గత కొన్ని నెలలుగా నిరాశతో ఉన్నట్లు తల్లి చెప్పినట్లు పోలీసులు తెలిపారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న రాజేంద్రనగర్ పోలీసులు" రూంలో ఎలాంటి సూసైడ్ నోట్ దొరకలేదు.ఆమె మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. కుటుంబం ఎటువంటి అనుమానం వ్యక్తం చేయలేదు.ఈ మెరుగు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి..

మండల వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి

**నిజాంపేట,అక్టోబర్29(సూర్యరేఖ)** ఈ అకాల వర్షాలకు ధాన్యం తడవ కుండా జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి అన్నారు.ఈ మేరకు నిజాంపేట మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డులో మంగళవారం వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతుల యొక్క వరి కుప్పల తేమశాతం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మెంథ తుఫాను ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు వడ్ల కుప్పల పై తాపర్ల కవర్లను ముందుగానే సమకూర్చుకొని ధాన్యం తడవ కుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈఓ శోభారాణి రైతులు సుధాకర్ స్వామి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ రైజింగ్ -2047సిటిజన్ సర్వేలో అందరూ పాల్గొనాలి..



**ధన్వాడ,అక్టోబర్28(సూర్యరేఖ)** తెలంగాణా రాష్ట్ర భవిష్యత్ రూప కల్పనకై ఉద్దేశించిన" తెలంగాణ రైజింగ్2047"సిటిజన్ సర్వేకు ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోందని నారాయణపేట ఎన్ఎస్ యుఐ జిల్లా అధ్యక్షులు వింజమూరు దామోదర్ రెడ్డి తెలిపారు. ఇప్పటివరకు ఈ సిటిజన్ సర్వేలో కేవలం తెలంగాణ నుండే వివిధ ప్రాంతాల పౌరులు పాల్గొని తమ విలువైన సమాచారాన్ని అందచేశారు.భారత దేశ స్వాతంత్ర్యానికి వంద సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా 2047నాటికి తెలంగాణ రాష్ట్రం ఎలా ఉండాలో ప్రజల నుండి తగు సలహాలు,సూచనలు చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం"తెలంగాణ రైజింగ్– 2047 "సిటిజన్ సర్వేను చేపట్టింది.రాష్ట్ర ప్రభుత్వం గత వారం ప్రారంభించిన ఈసర్వే నవంబర్1వతేదీతో ముగుస్తుంది.ఈ సర్వే రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉన్నందున అనే వెబ్సైట్ను సందర్శించి ప్రతీ ఒక్కరు తమ అమూల్యమైన సలహాలు సూచనలను అందించాల్సిందిగా ఒక ప్రకటనలో తెలియ చేశారు.

## బెల్లంపల్లి కమిషనర్ కు వినతిపత్రం అందించిన ఎం.సి.పి.ఐ.యు నాయకులు



**బెల్లంపల్లి,అక్టోబర్28(సూర్యరేఖ)** బెల్లంపల్లి పట్టణంలో కుక్కల బెడద నుండి ప్రజలను కాపాడాలని డిమాండ్ చేస్తూ ఎం.సి.పి.ఐ.యు పార్టీ నాయకులు మంగళవారం మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్ కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్,పసులేటి వెంకటేష్,లు మాట్లాడుతూ...పట్టణంలో కుక్కలు నియంత్రణ లేకుండా తిరుగుతున్నాయని,ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారని తెలిపారు.31వ వార్డులో ఒక వృద్ధ మహిళను కుక్కకరవడంతో రక్తస్రావం జరిగిందని, అలాంటి సంఘటనలు చిన్నపిల్లలకు ప్రమాదకరమని చెప్పారు.వెంటనే చర్యలు తీసుకుని వీధికుక్కలను పట్టణం బయటకు తరలించాలని,ప్రజల భద్రతకు చర్యలు తీసుకోవాలని కమిషనర్,ను కోరారు.లేని పక్షంలో అన్ని పార్టీలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎం.సి.పి.ఐ.యు పార్టీ బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆరేపల్లి రమేష్, తోగరి రాహుల్,పొలోజు రామకృష్ణ, తదితర నాయకులు పాల్గొన్నారు.

## హెడ్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ తెలంగాణ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా పద్మావతి నియామకం..



**హైదరాబాద్,అక్టోబర్28(సూర్యరేఖ)** ఆంధ్రప్రదేశ్,తెలంగాణ రాష్ట్రాలలో కార్యకలాపాలు కొనసాగిస్తున్న హెడ్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ కు తెలంగాణ రాష్ట్రానికి చెందిన జె.పద్మావతిని తెలంగాణా రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ నెంబర్ గా నియమించినట్లు హెడ్ సంస్థ చైర్మన్ మాధవ్ మీడియాకు తెలిపారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా నియమితులైన జె.పద్మావతి మాట్లాడుతూ...నా మీద నమ్మకం ఉంచి నన్ను ఎగ్జిక్యూటివ్ నెంబర్ గా నియమించినందుకు చైర్మన్ మాధవ్,నా నియామకానికి కృషిచేసిన జాతీయ ప్రధాన కార్యదర్శి సతీష్ దేవరకొండలకు ధన్యవాదాలు తెలిపారు.నా శక్తి మేరకు సంస్థ ఎదుగుదలకు కృషి చేస్తానని,బాధితులకు అండదండగా ఉంటానని బాధితులకు న్యాయం లభించే లాగా పోరాటం చేస్తానని స్పష్టం చేశారు. హెడ్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ తరఫున మానవ హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉంటామని తెలిపారు.పదవి బాధ్యతలు చేపట్టిన పద్మావతికి సంస్థ సభ్యులు,పుర ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సత్కరించారు.

# కాంగ్రెస్ ఓటమి భయంతో మంత్రుల ప్రచారం నైతికంగా ఓడినట్





**ఆలోచించి అభివృద్ధిని కాంక్షించే బీజేపీ అభ్యర్థికి ఓటు వేయండి.. దేవర శ్రీనివాస్.**

**నాంపల్లి,హైద్రాబాద్,అక్టోబర్28(సూర్యరేఖ)** జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో ప్రజలను మభ్యపెట్టి మరోసారి మోసం చేయాలని కాంగ్రెస్,బీఆర్ఎస్ పార్టీలు చూస్తున్నాయని,జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అభివృద్ధి సాధించాలంటే బిజెపితోనే సాధ్యమని భారతీయ జనతా పార్టీ అనుబంధ సంఘం కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు దేవర శ్రీనివాస్ అన్నారు.జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారంలో భాగంగా బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డితో పటు పార్టీ శ్రేణులు అభిమానులతో కలసి దేవర శ్రీనివాస్ ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో దేవర శ్రీనివాస్ మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధి సాధించాలంటే బీజేపీనే సాధ్యమన్నారు. రాష్ట్ర పరిపాలన గాలికి వదిలేసి జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం మంత్రులు ప్రచారంలో దిగడంకు కారణం ఓటమి భయంతోనే అన్నారు.యూసఫ్ గూడ డివిజన్ కు ఉత్తమ్ కుమార్ రెడ్డి,పొన్నం ప్రభాకర్, లు,రహమత్ నగర్ డివిజన్ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి,పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,వెంగల్ రావునగర్ డివిజన్ కు తుమ్మల నాగేశ్వరరావు వాకిటి శ్రీహరి సోమాజిగూడ డివిజన్ కు శ్రీధర్ బాబు,అడ్లూరి లక్ష్మణ్,బోరబండ డివిజన్ కు సీతక్క,ఎంపీ మల్లు రవి,షేక్ పేట్ డివిజన్,కు కొండా సురేఖ,వివేక్ వెంకటస్వామి ఎర్రగడ్డ డివిజన్ కు దామోదర రాజనర్సింహ జూపల్లి కృష్ణారావు,లు ప్రచార భాద్యతలు తీసుకోవడం నైతికంగా ఓటమిని అంగీకరించినట్టే అన్నారు. ప్రజలందరూ చైతన్యవంతంగా ఆలోచించి కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని నియోజకవర్గం పరిసర ప్రాంతాల బస్తీలు కాలనీలు అపార్ట్మెంట్ వాసులను కలిసి ప్రచారం చేయడం జరుగుతోందని తెలిపారు

## పెండింగ్ డీఏలను త్వరగా ఇప్పించండి..

**టీఎన్జీవో అధ్యక్షుడు గడియారం శ్రీహరి**



**మంచిర్యాల,అక్టోబర్28(సూర్యరేఖ)** ఉద్యోగులకు రావలసిన పెండింగ్ డీఏలను త్వరగా ఇప్పించాలని,మంచిర్యాల జిల్లా టీఎన్జీవో అధ్యక్షులు గడియారం శ్రీహరి కోరారు.టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షులు మారం జగదీశ్వర్ అధ్యక్షతన టీఎన్జీవో భవన్ నాంపల్లిలో మంగళవారం జరిగిన కార్యవర్గ సమావేశంలో మంచిర్యాల జిల్లా తరఫున జిల్లా అధ్యక్షులు గడియారం శ్రీహరి,కార్యదర్శి భూముల రామ్మోహన్,కేంద్ర సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య,లు పాల్గొన్నారు.ఈ కార్యవర్గ సమావేశంలో జిల్లా అధ్యక్షులు గడియారం శ్రీహరి మాట్లాడుతూ టీఎన్జీవో సభ్యత్వ నమోదును మంచిర్యాల జిల్లాలో డిసెంబర్ వరకు పూర్తి చేస్తామని తెలిపారు.ఉద్యోగ సమస్యలైనా సిపిఎస్ ను సెప్టెంబరు1న కాకుండా కార్యాచరణ ప్రకటించి పాత పెన్షన్ విధానం రావడానికి ప్రణాళిక తయారు చేయాలని కోరారు.ఉద్యోగులకు ఇవ్వాల్సిన పెండింగ్ డీఏలను త్వరగా ఇప్పించాలని కోరారు. అదేవిధంగా మంచిర్యాల జిల్లా టిఎన్జీవో హౌసింగ్ సొసైటీ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించుటకు రెవెన్యూశాఖ సిసిఎల్ ఏతో మాట్లాడి సమస్య పరిష్కారం చేయాలని కోరారు.

# గ్రామాలలో పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలి





**జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య**


**నిజాంపేట,అక్టోబర్28(సూర్యరేఖ)** మండల పరిధిలోని కల్వకుంట గ్రామంలో మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య ఆకస్మిక తనిఖీ చేయడం జరిగింది.గ్రామంలో పారిశుధ్య పనులు పర్యవేక్షించి నర్సరీ,ఇందిరమ్మ ఇండ్లను సందర్శించారు.ఇందిరమ్మ ఇండ్లు కట్టుకునే లబ్ధిదారులు త్వరగతిన ఇల్లు నిర్మాణ పనులను పూర్తి చేసుకోవాలన్నారు.అలాగే వడ్ల కొనుగోలు కేంద్రాలలో సందర్శించి ఈ అకాల వర్షాలకు వరి ధాన్యం తడవకుండా తాటిపత్రిలను ఏర్పాటు అందుబాటులో ఉంచుకోవాలని రైతులకు సూచించారు.అనంతరం వెంకటాపూర్ కె గ్రామంలో గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలించి గ్రామంలో ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు పాటుపడాలని గ్రామాల అభివృద్ధికి సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ఎంపిఓ వెంకట నరసింహారెడ్డి, కార్యదర్శు లు కవిత ప్రేమ తదితరులు పాల్గొన్నారు.

## జిన్నింగ్ మిల్లు,అంతరాష్ట్ర సరిహద్దు చెక్ పోస్ట్ ను తనిఖీ చేసిన జిల్లా అదనపు కలెక్టర్ వి.విక్టర్



**కామారెడ్డి,అక్టోబర్28(సూర్యరేఖ)** కామారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ వి.విక్టర్ మద్నూర్ మండలంలో అంతరాష్ట్ర సరిహద్దు వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్,ను మంగళవారం తనిఖీ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో వరి కోనుగోలు కేంద్రాలు కొనసాగుతున్నాయి.సన్న వడ్లకు 500 బోనస్ ను రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్నందున ఇతర రాష్ట్రాల నుండి తెలంగాణ రాష్ట్రంలోకి సన్న వడ్లు రాకుండా రాష్ట్ర సరిహద్దు వద్ద చెక్ పోస్ట్ ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.అదే విధంగా పత్తి పంటను మార్కెట్ కు వస్తున్నందున దానికి సంబంధించిన జిన్నింగ్ మిల్లును పరిశీలించారు. మిల్లులో తీసుకుంటున్న జాగ్రత్తలు ఏర్పాట్లను పరిశీలించారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని మార్కెట్ కమిటీ కార్యదర్శిని ఆదేశించారు.అదనపు కలెక్టర్ వెంట తహసీల్దార్ ఎం.డి.ముజీబ్,సివిల్ సప్లైనాయబ్ తహసిల్దార్ ఖలీద్,రెవెన్యూ పోలీస్ మార్కెట్ కమిటీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## హరీశ్ రావు పితృవియోగంపై సంతాపం తెలిపిన ఠాకూర్ జీవన్ సింగ్..



**నాంపల్లి,హైద్రాబాద్,అక్టోబర్28(సూర్యరేఖ)**బీఆర్ఎస్ ఎమ్మెల్యే,మాజీ మంత్రి హరీశ్ రావు ఇంట విషాదం నెలకొంది.ఆయన తండ్రి తన్నీరు సత్య నారాయణ వయోభారం అనారోగ్యం కారణాల వల్ల ఆయన కన్నుమూశారు. కోకాపేటలోని క్రిన్స్‌విల్లాస్‌లో సందర్శనార్థం ఆయన పార్థివదే హాన్ని ఉంచారు. హరీశ్ రావుకు పితృవియోగం పై బీఆర్ఎస్ పార్టీ కార్వాన్ నియోజకవర్గం ఇంచార్జ్ ఠాకూర్ జీవన్ సింగ్ సంతాపం తెలియజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సత్యనారాయణ పవిత్ర ఆత్మకుశాంతి చేకూరాలని ప్రార్థించారు.

# ఘనంగా హనుమాన్ బస్తీలో బోనాల పండుగ





**బోనాల పండుగ అంటే తెలంగాణ సాంస్కృతిక ఐక్యతకు ప్రతీక బండి ప్రభాకర్ యాదవ్**

**బెల్లంపల్లి,అక్టోబర్28(సూర్యరేఖ)** బెల్లంపల్లి పట్టణం 34వ వార్డు హనుమాన్ బస్తీలో భూలక్ష్మి పోచమ్మ తల్లుల బోనాల వేడుకలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీపీసీసీ ఓబీసీ స్టేట్ వైస్ చైర్మన్ బండి ప్రభాకర్ యాదవ్ హాజరై భక్తి భావంతో పాల్గొన్నారు.మహిళలు పెద్ద ఎత్తున హాజరై అమ్మవారికి బోనాలు సమర్పించి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా బండి ప్రభాకర్ యాదవ్ మాట్లాడుతూ... బోనాల పండుగ తెలంగాణ సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అని,ఈ పండుగలో మహిళల భక్తి,ఆచార సంప్రదాయాలు మన సంస్కృతిని ప్రతిబింబిస్తాయని అన్నారు.భక్తి, సమైక్యత సంతోషం నిండిన ఈ ఉత్సవాలు సమాజంలో సౌహార్ద వాతావరణాన్ని తీసుకువస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ పట్టణ కార్యదర్శి కేశ బోయిన అఖిల్,కాంగ్రెస్ నాయకులు పోలు శ్రీనివాస్,గాదం శ్రీధర్,గొడుగు రఘు,కనుకుంట్ల శ్రీనివాస్,అరకొండ మొండి గోస్కుల సంపత్, మహంకాళి బాపు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డి నియోజకవర్గానికి మరిన్ని కొత్త బస్సులను కేటాయించాలి..

**ఎల్లారెడ్డి పట్టణంలో కొత్త ఆర్టీసీ డిపోను స్థాపించాలి.. ఎమ్మెల్యే మదన్మోహన్.**



**కామారెడ్డి,అక్టోబర్28(సూర్యరేఖ)**ఇటీవల ఎల్లారెడ్డికి 10 నూతన బస్సులు కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ,ప్రజల రవాణా సౌకర్యాలను మరింత విస్తరించాల్సిన అవసరాన్ని ఎమ్మెల్యే ఎండీకి వివరించారు. ఎల్లారెడ్డి ప్రజల రవాణా సౌకర్యం,అభివృద్ధి, మరియు ప్రజల అవసరాలు తీర్చడం తమ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే మదన్మోహన్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఎమ్మెల్యే మదన్మోహన్ డిమాండ్లకు సానుకూలంగా స్పందించిన ఎండి నాగిరెడ్డి,ఎల్లారెడ్డి ప్రజల సమస్యలు తీర్చడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## పత్తి,మొక్కజొన్న కొనుగోలుపై రైతులకు అవగాహన..

**నాగల్ గిద్ద,అక్టోబర్28(సూర్యరేఖ)** మండల పరిధిలోని మావినెల్లి రైతు వేదికలో మంగళవారం పిజెటిఎస్ఏయు వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో రైతులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పత్తి,మొక్కజొన్న కొనుగోలుపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలతో ఏఈఓ సంతోష్,మార్కెటింగ్ అధికారులు,క్లస్టర్ రైతులు పాల్గొన్నారు.



## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి..

**డిసిఎంఎస్ మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు అరిగే రమేష్ కుమార్..**



**కొల్చారం,అక్టోబర్28(సూర్యరేఖ)** ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రం సద్వినియోగం చేసుకుని రైతులు గిట్టుబాటు ధర పొందాలని డీసీఎంఎస్ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు,రంగంపేట సహకార సంఘం అధ్యక్షులు అరిగే రమేష్ అన్నారు.మెదక్ జిల్లా కొల్చారం మండలంలోని పైతరలో రంగంపేట సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ... కొనుగోలు కేంద్రానికి నిర్ణయించిన తేమ శాతం ఉన్న ధాన్యాన్ని రైతులు తీసుకురావాలని,ధాన్యం తుర్పార బడితే తరుగు ఉండదని అన్నారు.ఈ సందర్భంగా రైతులు ప్రతి ఏటా లారీల కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సీజన్లో అయినా లారీల సమస్య తలెత్తకుండా రంగంపేట సహకార సంఘం పాలకవర్గం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు మురళిగౌడ్, భాను ప్రకాష్ రెడ్డి,ఎల్లయ్య సహకార సంఘం డైరెక్టర్ జీవన్,సహకార సంఘం సీఈవో నవీన్,సిబ్బంది బీరప్ప,దుర్గేష్,నరేష్,నాయకులు షాదుల్లా,బసారం యాదగిరి,తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం మహాప్రాణదానం..

**బెల్లంపల్లి పోలీసుల ఆదర్శ కార్యక్రమం..**




**బెల్లంపల్లి,అక్టోబర్28(సూర్యరేఖ)** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి వన్ టౌన్ పోలీసు సిబ్బంది ఆధ్వర్యంలో పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం విశేషం.బెల్లంపల్లి సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారుల సమన్వయంతో అక్టోబర్ 29వ తేదీ ఉదయం 9గంటలకు పట్టణంలోని పద్మశాలి భవన్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు వన్ టౌన్ సిఐ శ్రీనివాసరావు తెలిపారు. సమాజసేవ పట్ల పోలీసు విభాగం చూపుతున్న నిబద్ధత,రక్తదానాన్ని ప్రాణదానంగా భావిస్తూ చేస్తున్న ఈ కార్యక్రమం ప్రజలకు స్ఫూర్తిదాయకమని ఆయన పేర్కొన్నారు.పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రజల ప్రాణరక్షణలో రక్తదానం ఎంత ముఖ్యమో గుర్తుచేశారు.ఈ సందర్భంగా సిఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ... “మనలో ప్రతి ఒక్కరి రక్తం ఇంకొకరి ప్రాణానికి ఆధారం కావచ్చు..రక్తదానం ద్వారా అమరవీరుల త్యాగాలకు నిజమైన నివాళి అర్పించామన్నారు. బెల్లంపల్లి పట్టణ ప్రజలు, యువత,ఉద్యోగులు అందరూ ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని, సమాజానికి సేవ చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## ప్రభుత్వ పథకాలు బీడి కార్మికులకు అందేలా చర్యలు తీసుకుంటాం..

**మంత్రి వివేక్**



**ముస్తాబాద్,అక్టోబర్29(సూర్యరేఖ)** తెలంగాణ బీడి టెకేదారుల సంక్షేమ సంఘం ముస్తాబాద్ మండల అధ్యక్షులు బద్దేపూరి శ్రీనివాస్, ఆధ్వర్యంలో మండలములోని బీడి కార్మికులు కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు కోకన్వీనర్ కనమేని చక్రధర్ రెడ్డి ఆధ్వర్యంలో కార్మిక శాఖ మంత్రి వివేక్ ను మంగళవారం హైదరబాద్ లో కలిశారు.ఈ సందర్భంగా బద్దేపురీ శ్రీనివాస్ మంత్రి వివేక్ కు బీడి కార్మికులకు సంబంధిచిన వినతి పత్రం అందజేశారు.పిఎఫ్ తో సంబంధం లేకుండా2014 నుంచి ఉన్న పిఎఫ్ కటాఫ్ తేదీని ఎత్తివేయాలని, బీడీలు చుట్టే కార్మికులందరికీ 4000 పెన్షన్ అందజేయాలని అన్నారు.ఇట్టి విషయాన్ని ఇదివరకే సిఎం రేవంత్ రెడ్డితో చర్చించామని,డిసెంబర్ లో బీడి కార్మికులకు పించన్ అమలవుతుందని మంత్రి వివేక్ అన్నారు.ఈ కార్యక్రమంలో తిరునగరి రంగయ్య,కొంక రాజు,యాడరపు రాజు,మడిపడిగే శంకర్,తదితరులు పాల్గొన్నారు.

# బియ్యం ఎగుమతులపై జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మేధో మధనం





**పౌరసరఫరాల శాఖ కమిషనర్,వ్యవసాయశాఖ సంచాలకులు హాజరు..**

**ఎగుమతులతోనే బియ్యం అధిక నిలువల సమస్యకి పరిష్కారం..**

**రాజేంద్రనగర్,అక్టోబర్28(సూర్యరేఖ)** రాష్ట్రంలో నానాటికి వరి ఉత్పత్తులు పెరుగుతున్న నేపథ్యం లో స్థానిక వినియోగం,ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా మరియు కేంద్రానికి కేటాయించిన కోటా పోను దాదాపు 50 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వలు మిగులుతున్న నేపథ్యంలో వాటిని ఎలా సద్వినియోగం చేసుకోవాలన్న అంశంపై మంగళ వారం రాజేంద్రనగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం అగ్రిహబ్ లో ఒక మేధో మధన సదస్సు జరిగింది. వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాష్ట్ర పౌరసరఫ రాల సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన ఈ సదస్సులో పౌరసరఫరాల కమిషనర్ ఎం.స్టీఫెన్ రవీంద్ర,వ్యవసాయశాఖ సంచాలకులు డాక్టర్ బి.గోపి,పౌరసరఫరాలశాఖ సంచాలకులు హను మంత్ కొండిబా,అదనపు సంచాలకులు రోహిత్ తో పాటు వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకుల పతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డాక్టర్ మరాఠి బలరాం వరి ప్రధాన శాస్త్రవేత్తలు, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా అంతర్జాతీయ బియ్యం ఎగుమతుల విశ్లేషకులు మరియు వరల్డ్ ఫుడ్ ఫౌండేషన్ అవార్డు గ్రహీత డాక్టర్ సమరేందు మహంతి ప్రముఖ బియ్యం ఎగుమతిదారులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.ప్రపంచం మొత్తం మీద ఆరు కోట్ల మెట్రిక్ టన్నుల బియ్యం ఎగుమ తులు జరుగుతుండగా అందులో అత్యధికంగా భారతదేశం వాటా 40 శాతంగా ఉందని సదస్సు లో వక్తలు పేర్కొన్నారు. అదేవిధంగా ప్రపంచ బియ్యం దిగుమతుల్లో అత్యధికంగా ఫిలిప్పైన్స్ దేశం 10 శాతం దిగుమతులు చేసుకుంటుందని తెలిపారు. తెలంగాణలో బియ్యం ఉత్పత్తి 2014 నుండి 2024 వరకు మూడు రెట్లు పెరిగిందని సమరేందు మహంతి వివరించారు.ఈ ఏడాది సుమారు 2 కోట్ల మెట్రిక్ టన్నుల బియ్యం ఉత్పత్తి అయ్యే అవకాశం ఉందన్నారు.ఇందులో రాష్ట్ర అవసరాలకు సుమారు 50 లక్షల మెట్రిక్ టన్నులు పోగా అధిక నిల్వలు మిగిలిపోతాయని,వీటిని ఆఫ్రికా,ఆసియా దేశాలకు ఎగుమతి చేయడానికి అవకాశాలు ఉన్నాయని మహంతి వివరించారు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రం నుండి ‘తెలంగాణ రైస్’అనే బ్రాండ్ తో ఫిలిప్పైన్స్ కి ఎగుమతులు ప్రారంభమయ్యాయని వాటిని ఇంకా పెంచాల్సిన అవసరం ఉందని మహంతి తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న ఉప్పుడు బియ్యానికి ఆఫ్రికా దేశాల్లో మంచి ఆదరణ ఉందని.. ఆ దేశాలకు ఎగుమతులు పెరిగే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.50 ఏళ్ల క్రితం పౌరసరఫరాల కార్పొరేషన్ స్థాపించినప్పుడు డిమాండ్ కు తగిన విధంగా ఆహార ఉత్పత్తులు ఉండేవి కావని ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య అన్నారు.ఆ పరిస్థితుల్లో ఏర్పాటైన పౌరసరఫరాల కార్పొరేషన్ పేద,మధ్యతరగతులకి ఆహార భద్రత కల్పించడానికి ఇతోదికంగా దోహదపడిందన్నారు. అయితే నేడు పరిస్థితులు మారిపోయాయని డిమాండ్ కు మించి ఆహార ఉత్పత్తులు పెరుగుతున్నాయని తద్వారా అధికమవుతున్న నిల్వలకి అంతర్జాతీయ మార్కెట్లను అన్వేషించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. తదనుగుణంగా ఎదురయ్య సవాళ్ళను ఎదుర్కొనే విధంగా కార్పొరేషన్ ను సంస్కరించాలని జానయ్య సూచించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పౌరసరఫరాల సంస్థ బిజినెస్ మోడల్ ని తయారు చేయవలసిన అవసరం ఉందని పౌరసరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర అభిప్రాయపడ్డారు. అందుకు అనుగుణంగా రోడ్ మ్యాప్ ని సూచిస్తూ ఒక వ్యూహ పత్రాన్ని అందజేయవలసిందిగా వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని ఆయన కోరారు. అదేవిధంగా ఎగుమతుల్ని ప్రోత్సహించే విధంగా కార్పొరేషన్ లో ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.అధిక బియ్యం నిల్వల్ని ప్రపంచవ్యాప్తంగా ఎగుమతి చేయడానికి ఉన్న అవకాశాలని ఈ ప్రత్యేక విభాగం అన్వేషిస్తుందని స్టీఫెన్ రవీంద్ర తెలిపారు.యాసంగిలో వరి సాగును తగ్గించి పప్పు దినుసులు,నూనె గింజల సాగుని పెంచే విధంగా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని వ్యవసాయసంచాలకులు డాక్టర్ బి.గోపి అన్నారు.అంతే కాకుండా దేశీయ,ప్రపంచ మార్కెట్ లలో డిమాండ్ ఉన్న వరి రకాల సాగుని ప్రోత్సహించే విధంగా విశ్వవిద్యాలయంతో కలిసి రైతాంగంలో అవగాహన కల్పించే కార్యక్రమాల్ని చేపట్టామని గోపి వివరించారు.

# లంగర్ హౌస్ ప్రాంతంలో ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో అత్యంత భక్తిశ్రద్ధలతో ఛట్ పూజ







**నాంపల్లి,హైద్రాబాద్,అక్టోబర్ 28(సూర్యరేఖ)**హైదరాబాద్ లోని లంగర్ హౌస్ ప్రాంతంలో గల తపోవనంపార్క్ లో ఛట్ పూజ కార్యక్రమం ఛట్ పూజా సమితి అధ్యక్షుడు ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో రెండు రోజుల పటు ఛట్ పూజ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అత్యంత పవిత్రంగా కొలిచే గొప్ప పండుగ ఛట్ పూజ అని, బీహార్ జారండ్ మధ్యప్రదేశ్ ఉత్తరప్రదేశ్ ఛత్తీస్గఢ్ చండీగఢ్ గుజరాత్ గయ రాంచీ ఢిల్లీ ముంబై తదితర ప్రాంతాల్లో ప్రముఖంగా కార్తీక మాసంలో జరుపుకునే పూజ ఛట్ పూజ అని తెలిపారు. భూమి మీద తమకు మనుగడ కల్పిస్తున్న సూర్యభగవానుడికి కృతజ్ఞతలు చెప్పుకుంటూ ఆయురారోగ్య,ఆనందాలను ప్రసాదించమని ప్రార్థిస్తారన్నారు.సూర్యుని ఆరాధించడం వల్ల దీర్ఘకాలిక వ్యాధులు కూడా నయమవుతాయని నమ్ముతారని తెలిపారు.పవిత్ర నదిలో పుణ్యస్నానం చేసి నీటిలో వీలైనంత ఎక్కువసేపు నిలబడి సూర్యభగవానుని ఆరాధిస్తారని,దీపాలు వెలిగించి పండ్లు,ఫలాలు ప్రసాదంగా సమర్పిస్తారాని అన్నారు.పూజా పర్యవేక్షణలో సమితి కార్యని ర్వాహక సభ్యులు సునీల్ సింగ్,రాహుల్ సోని సురేష్ ప్రసాద్ రాజేందర్ సింగ్,రాజీవ్ రాజన్, కుమార్ శుక్లా అదితి కుమారి,దీపక్ విశ్వకర్మ శైలేష్ కుమార్ గోవింద్ ఠాకూర్ ఇంద్రజీత్ ప్రజాపతి,సురేష్ కుమార్,రాజ్ కుమార్ దీపక్ కుమార్,మనీష్ కుమార్ శర్మ,ఆనంద్ సింగ్,రాజేష్ శని తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి ఉద్యోగులకు నాణ్యమైన వైద్యం అందించాలి





**ఏరియా జిఎం ఎన్.రాధాకృష్ణ**

**మందమర్రి,అక్టోబర్28(సూర్యరేఖ)** సింగరేణి ఉద్యోగులు,వారి కుటుంబ సభ్యులకు, రిటైర్డ్ ఉద్యోగులకు ఎల్లవేళలా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ అన్నారు.ఏరియాలోని కే.కే డిస్పెన్సరీని మంగళవారం సందర్శిం చిన ఆయన సింగరేణి ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి,ఆసుపత్రి నిర్వహణపై వైద్య అధికారి నిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ...సింగరేణి ఉద్యోగులకు వారి కుటుంబ సభ్యులకు,రిటైర్డ్ ఉద్యోగులకు అంకిత భావంతో మెరుగైన వైద్య సేవలు అందించాలని విధి నిర్వహణలో క్రమశిక్షణ పాటించాలని ఆసుపత్రిలో పరిశుభ్రత పాటించాలని వారు వైద్య అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆయన వెంట పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుంద ర్,ఐఈడి (ఎస్.సి) కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

# పీఎం ధన్ ధాన్య కృషి యోజన పథకం వార్షిక ప్రణాళికను సిద్ధం చేయాలి






**జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్**

**నారాయణపేట,అక్టోబర్28(సూర్యరేఖ)** పీఎం ధన్ ధాన్య కృషి యోజన పథకం అమలుకు వార్షిక ప్రణాళికను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు.మంగళవారం జిల్లాకలెక్టరేట్ లోని వీసీ హాల్ లో పీఎం ధన్ ధాన్య కృషి యోజన కమిటీ సభ్యుల తొలి సమావేశం నిర్వహించగా జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు..సహజ సేంద్రీయ వ్యవసాయాన్ని విస్తరించడం,రైతుల ఆదాయం గ్రామీణ జీవనోపాధికి మద్దతు ఇస్తూ స్థిరమైన వాతావరణ స్థితిస్థాపక వ్యవసాయాన్ని స్వీకరించడమే పథకం ఉదేశ్యం అని ఆమె తెలిపారు.అయితే జిల్లాలో ఆపథకం అమలుకు సంబంధిత శాఖల అధికారులు తమ తమ శాఖలకు సంబంధించిన వార్షికప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. ప్రణాళికకంటే ముందుగా జిల్లాలో ప్రస్తుత స్థితిని నిర్ధారించడానికి ఒక బేస్ లైన్ సర్వే చేపట్టాలన్నారు. ఇందులో 9అంశాలు ఉంటాయని ఆమె తెలిపారు.ప్రకృతి వైపరీత్యాలు పంటల తెగుళ్ళు,వ్యాధులు, పశువుల వ్యాధులు మొదలైన వాటికి సున్నితమైన ప్రాంతాల గుర్తింపు అంశాల వారీగా క్లుప్తంగా నివేదిక తయారు చేసి అందుకు తగిన యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని కలెక్టర్ ఆయాశాఖల అధికారులను ఆదేశించారు.బేస్‌లైన్ సర్వే,డయాగ్నస్టిక్ విశ్లేషణ ఆధారంగా,జిల్లా వ్యవసాయ వాతావరణ ప్రాంతం వనరులకు అనుగుణంగా సమగ్రమైన స్థిరమైన వ్యవసాయం, అనుబంధ రంగ అభివృద్ధి ప్రణాళికను సిద్ధం చేయాలని ఆమె చెప్పారు.పంట తీవ్రత, ఉత్పాదకత,పంట కోత అనంతర మౌలికసదుపాయాలు,ఉద్యానవన/ మత్స్య పరిశ్రమ/ పశుపోషణ రుణ ప్రవాహానికి వైవిధ్యీకరణతో ముడిపడి ఉన్న ఐదేళ్లఫలిత ఆధారిత లక్ష్యాలు ఉంటాయని ఐదు సంవత్సరాల ఫలితాన్ని సాధించడానికి అవసరమైన వివిధ పథకాల భౌతిక లక్ష్యమని,ఈ లక్ష్యాలను భౌతిక ఆర్థికపరం,ఐదుసంవత్సరాల వార్షిక లక్ష్యాలుగా విభజించవచ్చని కలెక్టర్ స్పష్టం చేశారు.అంతకు ముందు స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ వ్యవసాయశాఖ,పశు సంవర్ధకశాఖ,పాడి పరిశ్రమ మత్స్య,ఆర్టికల్చర్ జిల్లా సహకార సంస్థ అధికారులతో ఆయా శాఖలలో కొనసాగుతున్న ప్రస్తుత అభివృద్ధి పనులు,పథకాల అమలు గురించి అధికారులతో వివరాలను అడిగి తెలుసుకున్నారు.రైతు ఉత్పత్తిదారుల సంస్థలను ఏర్పాటు చేయడం ద్వారా ధన్ ధాన్య కృషి యోజన పథకం అమలుకు దోహదపడుతుందని అదనపు కలెక్టర్ తెలిపారు.అయితే రెండు రోజుల్లో బేస్ లైన్ సర్వేతో కూడిన ప్రణాళికను సిద్ధంచేయాలని అలాగే డాక్యు మెంటరీని రూపొందించాలని ఆయన ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆపథకం నోడల్ అధికారి సాయిబాబా,డిఆర్డిఓ మొగులప్ప,ల్లా వ్యవసాయశాఖ అధికారి జాన్ సుధాకర్,జిల్లా మత్స్యశాఖ అధికారి రహమాన్,నాబార్డ్ జిల్లా మేనేజర్ షణ్ముఖచారి,ఎల్డిఎం విజయ్ కుమార్, నీటి పారుదలశాఖ ఈ.ఈ.బ్రహ్మానంద రెడ్డి,జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ రెడ్డి,జిల్లా కో-ఆపరేటివ్ అధికారి రమణారావు పశుసంవర్ధక శాఖఅధికారి అనిరుద్,కేవీకే శాస్త్రవేత్తలు రాజేంద్ర కుమార్ రెడ్డి,సురేష్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.

# మావోయిస్టు అగ్ర నేత బండి ప్రకాష్ లొంగుబాటు





**మందమర్రి,అక్టోబర్ 28(సూర్యరేఖ)** మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు, మావోయిస్టు అనుబంధ సింగరేణి కార్మిక సమాఖ్య (సికాస) నాయకుడు బండి ప్రకాష్ అలియాస్ ప్రభాత్ మంగళవారం హైదరాబాద్ లో రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి ఎదుట లొంగిపోయారు. మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా నేషనల్ పార్క్ ఏరియా ఆర్గనైజర్‌గా కీలక బాధ్యతలు నిర్వహించిన ప్రకాష్ సుమారు 45 ఏళ్లుగా మావోయిస్టు పార్టీలో వివిధ హోదాల్లో పనిచేశారు.కగార్ ఆపరేషన్ కు తోడు దండకారణ్యంలో ఉద్యమం బలహీనపడగా,45 ఏళ్ల సుదీర్ఘ పోరుబాటను వీడి అనారోగ్య సమస్యలతో డీజీపీ సమక్షంలో లొంగిపోయారు.

**బండి ప్రకాష్ ప్రస్థానం..**

మావోయిస్టు నాయకుడు బండి ప్రకాష్ జిల్లాలోని మందమర్రి పట్టణానికి చెందిన సింగరేణి ఉద్యోగి అయిన బండి రామారావు,అమృతమ్మ ల రెండవ కుమారుడు.1982-84 మధ్య అప్పటి పీపుల్స్ వార్ అనుబంద విద్యార్థి విభాగమైన రాడికల్ స్టూడెంట్ యూనియన్ (ఆర్ఎస్యు)లో చురుకుగా పాల్గొని, సికాస ఆవిర్భావం తరువాత మిలిటెంట్ గా పనిచేశారు.ఇదే సమయంలో సింగరేణిలో ఉద్యోగిగా కాల్ లెటర్ వచ్చినప్పటికీ ఉద్యోగాన్ని తృణప్రాయంగా వదులుకొని ఉద్యమబాట పట్టారు. 1984లో మందమర్రిలో జరిగిన ఏఐటియుసి నాయకుడు విటి అబ్రహం హత్య కేసులో అరెస్ట్ అయిన ప్రకాష్ ఆదిలాబాద్ సబ్ జైలుకు తరలించగా,అక్కడ నాటి పీపుల్స్‌వార్ ముఖ్య నేతలైన నల్లా ఆదిరెడ్డి,మహమ్మద్ హస్సేన్, ముంజ రత్నయ్యగౌడ్ లతో పరిచయం ఏర్పడి వారితో కలిసి ఆదిలాబాద్ సబ్ జైలు గోడలను బద్దలుకొట్టి, తుపాకులతో సహా చాకచక్యంగా తప్పించుకున్నారు. అప్పట్లో ఈ ఘటన పెద్ద సంచలనం సృష్టించింది.ఆ తరువాత అంచలంచలుగా మావోయిస్టు పార్టీలో కీలకంగా వ్యవహరిస్తూ పోలీసులకు మోస్ట్ వాంటెడ్ జాబితాలో చేరాడు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వంతో 2004లో మావోయిస్టులు జరిపిన శాంతి చర్చల సమయంలో కీలకంగా వ్యవహరించారు.చర్చలు విఫలమైన అనంతరం వనం బాటపట్టారు.గత 20 ఏళ్లుగా బండి ప్రకాష్ మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీలో అత్యంత కీలక పాత్ర పోషించారు. నేషనల్ పార్క్ ఏరియా ఛత్తీస్‌గఢ్, బస్తర్ దండకారణ్యంలో మావోయిస్టు పార్టీ ఆర్గనైజర్ గా అత్యంత కీలక బాధ్యతలు నిర్వర్తించాడు.సింగరేణి కార్మిక సమాఖ్య పేరుతో మావోయిస్టు అనుబంధ సంఘాన్ని అంచలంచెలుగా విస్తరించడంలో కీలక పాత్ర పోషించారు.ఇప్పటి వరకు అనేక ఎన్ కౌంటర్ ల నుండి తృటిలో తప్పించుకున్నాడు.ప్రస్తుతం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా,సికాస కార్యదర్శిగా, దండకారణ్యం ఆర్గనైజర్ గా పనిచేస్తున్న బండి ప్రకాష్ వయోభారం,దీనికి తోడు అనారోగ్య సమస్యల కారణంగా లొంగిపోయినట్లు సమాచారం. రాష్ట్ర డిజిపి ఎదుట ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన సీనియర్ మావోయిస్టు కీలక నేత బండి ప్రకాష్ లొంగిపోవడం చర్చనీయాంశమైంది.

# మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు తండ్రి

**తన్నీరు సత్యనారాయణ మరణం బాధాకరం..**

**కొల్చారం మండలం బీఆర్ఎస్ పార్టీ నాయకులు**

**కొల్చారం,అక్టోబర్28(సూర్యరేఖ)** మాజీ మంత్రి పార్టీ సీనియర్ నేత తన్నీరు హరీశ్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ మరణం తీవ్ర బాధాకరం వారి నివాసం హైదరాబాద్‌లో వారి పార్థివ దేహానికి మెదక్,కొల్చారం మండలాల బీఆర్ఎస్ పార్టీ నేతలు మంగళవారం పూలమాలలు వేసి నివాళు లర్పించారు.ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ళ మల్లికార్జున్ గౌడ్, కౌడిపల్లి సబ్ డివిజన్ ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ యాబన్న గారి మల్లారెడ్డి మెద క్ జిల్లా నాయకులు మామిళ్ళ



ఆంజనేయులు బీమారి కిషోర్,జయరాజ్, రంజిత్ అరుణ్,లడ్డు, కొల్చారం మండలం బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు ముత్యంగారి సంతోష్ కుమార్,



మండల బీఆర్ఎస్ యువత అధ్యక్షుడు కోనాపూర్ సంతోష్ రావు,బీఆర్ఎస్ పార్టీ యూత్ ఐకాన్ రవితేజరెడ్డి,తుక్కాపూర్ ఆంజనేయులు, తదితరులు ఉన్నారు.

## పొన్నంను కలిసిన బాల్ రెడ్డి



**ముస్తాబాద్,అక్టోబర్29(సూర్యరేఖ)** ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏళ్ల బాల్ రెడ్డి జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారంలో బీసీ సంక్షేమ రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను,అనిల్ కుమార్ యాదవ్,లను మంగళవారం కలిశారు.

## విధి కుక్కల దాడితో ముసలమ్మకు తీవ్రగాయాలు..

**వార్డు ప్రజలు స్పందించి ఆస్పత్రికి తరలింపు..**

**మున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం..**



**బెల్లంపల్లి,అక్టోబర్28(సూర్యరేఖ)** బెల్లంపల్లి మున్సిపాలిటీ 31వ వార్డులో ఉదయం టేకులపల్లికి చెందిన పాలు అమ్ముకునే ముసలమ్మ దారవెల్లి లక్ష్మీపై విధి కుక్కలు దాడి చేశాయి.ఈ ఘటనలో ఆమెకు తీవ్ర గాయాలు కాగా రక్తస్రావం జరిగింది.ఘటనను గమనించిన స్థానికులు తక్షణమే స్పందించి గాయపడిన ముసలమ్మను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విధి కుక్కల పెచ్చరిల్లిన బెడదపై వార్డు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రజల భద్రత కోసం వెంటనే చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రమేష్ కు అధికారులకు వినతి పత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు లెంకల శ్రావణ్ కుమార్,బుకాల రంజిత్ కుమార్, ఎల్దండి శ్యామ్,లెంకల రతీష్,గోపు కిషోర్,లెంకల రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు తండ్రి మరణం తీరని లోటు..

**నివాళులు అర్పించిన నర్సాపూర్ ఎమ్మెల్యే సునితారెడ్డి,మాజీ మంత్రి సబితారెడ్డి**



**కొల్చారం,అక్టోబర్28(సూర్యరేఖ)**తెలంగాణా మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావుకు పితృవియోగం కలిగింది.హరీష్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ మంగళవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. హైదరాబాద్ కొండాపురంలోని క్రిన్స్ విల్లాస్ లోని ఆయన నివాసంలో ఉన్న ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించారు,అనంతరం కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు.ఆమె వెంట, మాజీమంత్రి సబితరెడ్డి, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి,తెలంగాణ రాష్ట్ర మహిళా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ వ్యవస్థను బలోపేతం చేసేందుకే శిక్షణ తరగతులు..

**కమిషనర్ సాయి చైతన్య**



**కామారెడ్డి,అక్టోబర్28 (సూర్యరేఖ)** పోలీస్ వ్యవస్థను బలోపేతం చేసేందుకే శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ సాయిచైతన్య తెలిపారు. సమగ్రంగా రికార్డుల నిర్వహణలో నైపుణ్యాన్ని పెంపొందించడం పారదర్శకత మరియు సమయపాలన పోలీసు వ్యవస్థ బలోపేతానికి ముఖ్యమైన అంశాలని కమిషనర్ పోతరాజు సాయిచైతన్య అన్నారు.పోలీస్ వ్యవస్థను బలోపేతం చేయడంలో ముఖ్యమైన పలు అంశాలపై కమిషనరేట్ పరిధిలో కొత్తగా నియమితులైన పోలీస్ స్టేషన్స్ రైటర్స్ సిబ్బందికి పోలీస్ కార్యాలయంలో వారం రోజుల పాటు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం సిపి సాయిచైతన్య ప్రారంభించారు.ఈ సందర్భంగా సిపి సాయి చైతన్య మాట్లాడుతూ...శిక్షణ కార్యక్రమంలో అన్ని అంశాలపై బిలవకోలు నేర్చుకోవాలన్నారు.శిక్షణలో కేసు దర్యాప్తు పత్రాలు, ఎఫ్ఐఆర్ రిజిస్ట్రేషన్,సైబర్ క్రైమ్ రిపోర్టింగ్,ఆధునిక పోలీస్ డాక్యుమెంటేషన్ పద్ధతులపై పోలీస్ స్టేషన్ రైటర్స్ కు మారకదర్శకాలు అందించబడతాయి అన్నారు.ఈ శిక్షణ పూర్తి అయిన తర్వాత సిబ్బంది పోలీస్ స్టేషన్కు వెళ్లి తర్వాత తమపై అధికారులకు ఈ శిక్షణ గురించి క్షుణంగా తెలియజేయాలని సిపి తెలిపారు.పోలీస్ స్టేషన్కు వచ్చే ఫిర్యాదు దారులతో ఏవిధంగా మాట్లాడాలో కేసులు నమోదైతే ఏవిధంగా సత్వర చర్యలు తీసుకోవాలా అలాంటి కేసుల్లో జాషురా సాంకేతిక పద్ధతులు ఏవిధంగా ఉపయోగించాలో వాటన్నింటికీ గురించి తెలియజేయాలని సిపి సాయిచైతన్య తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆదరణ పోటీసిపి గట్టు బసవరెడ్డి పోలీస్ శిక్షణ కేంద్రం ఏసిపి రాజశేఖర్,సిఐ శివరాం, తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి జాబ్ మేళాతో యువత ముంగిటకే ఉద్యోగాలు





**సింగరేణి జాబ్ మేళాలతో 23,650మందికి ఉద్యోగాలు..**
**నిరుద్యోగుల మోముపై వెలుగులు నింపుతున్న సింగరేణి..**
**ప్రభుత్వ సంకల్పం,సింగరేణి సౌజన్యంతో ఏర్పాట్లపై యువత హర్షం..**
**ఏప్రిల్ నుండి ఇప్పటి వరకు 7పట్టణాల్లో భారీ జాబ్ మేళాలు..**
**జాబ్ మేళాలో పాల్గొన్న 66,965 మంది నిరుద్యోగ యువత..**

**మందమర్రి,అక్టోబర్28(సూర్యరేఖ)** ఉద్యోగం ప్రతీ నిరుద్యోగి స్వప్నం..తగిన విద్యార్హతలు ఉన్నా హైదరాబాద్ మహానగరంలో చెప్పులు అరిగేలా కంపెనీల చుట్టూ తిరిగినా ఉద్యోగం లభిస్తుందన్న హామీ ఉండదు.అలాంటి పరిస్థితుల్లో పట్టణాలు గ్రామీణ ప్రాంతాల యువత ముంగిటకే హైదరాబాద్ లోని ప్రముఖ కంపెనీలను తీసుకు వచ్చి, వారి అర్హతలకు తగిన ఉద్యోగాలను ఎంచుకునే అరుదైన అవకాశాన్ని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కల్పిస్తోంది. నిరుద్యోగుల ముఖాలపై వెలుగులు నింపుతూ,సింగరేణి గత ఆరు నెలలుగా మెగా ఉద్యోగ మేళాల రూపంలో ఒక బృహత్తర యజ్ఞాన్ని నిర్విరామంగా కొనసాగిస్తోంది. దాదాపు24 వేల మంది యువతకు కొలువులను కల్పించి వారిలో నూతన ఉత్సాహం నింపింది. రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి సింగరేణి చిరు తోడ్పాటుతో రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ప్రైవేటు రంగంలో కూడా ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలన్న రాష్ట్ర ప్రభుత్వ దృఢ సంకల్పంతో మెగా జాబ్ మేళా కార్యక్రమాల నిర్వహణ ద్వారా కార్యరూపం దాల్చి విజయవంతంగా నడుస్తోంది.రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి,రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఇంధనశాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆలోచనలతో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సౌజన్యంతో గత ఆరు నెలల కాలంలో 7పట్టణాలలో నిర్వహించిన జాబ్ మేళా కార్యక్రమాలలో 66,965 మంది నిరుద్యోగ యువత పాల్గొనగా,వీరిలో 23,650 మందికి ఉద్యోగాలు లభించడం విశేషం..ఇంత భారీ ఎత్తున జాబ్ మేళాలు నిర్వహించడం,పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పించడం బహుశా ఇదే ప్రథమం. ఏడవ తరగతి మొదలు పోస్ట్ గ్రాడ్యుయేషన్ విద్యార్హతలు గల వారితో పాటు, టెక్నికల్,మెడికల్, పారామెడికల్ తదితర అన్ని విద్యార్హతలు గల వారికి ఇక్కడ తమ అర్హతలకు తగిన ఉద్యోగాన్ని ఎంచుకునే అవకాశం దక్కింది.హైదరాబాద్ ప్రాంతం నుండి ఒక్కొక్క జాబ్ మేళా కార్యక్రమంలో 100 నుండి 250 వరకు పలు ప్రైవేటు కంపెనీల యాజమాన్యాలు పాల్గొని యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాయి. మైకులు,పోస్టర్లు, కరపత్రాలు వాట్సాప్ గ్రూపుల ద్వారా,పత్రికల ద్వారా విస్తృత ప్రచారం కల్పించడంతో ఈ జాబ్ మేళా కార్యక్రమాలు మారుమూల గ్రామాలు,పట్టణాల్లో ఉన్న యువతను విశేషంగా ఆకర్షించాయి. యువతీ, యువకులు వేలాదిగా తరలి రావడంతో పట్టణ ప్రాంతాలు ఒక ఉత్సవ వాతావరణాన్ని సంతరించుకున్నాయి.సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సౌజన్యంతో ఇక్కడ ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల ఏర్పాట్లను ఘనంగా నిర్వహించారని జాబ్ మేళాలో పాల్గొన్న నిరుద్యోగ యువత,స్థానిక ప్రజాప్రతినిధులు ప్రశంసలు కురిపించారు. మంత్రులు ప్రజాప్రతినిధుల చొరవతో భారీగా విజయవంతం అయ్యింది.ఈ జాబ్ మేళా కార్యక్రమాలను సంబంధిత ఏరియాల మంత్రులు, ప్రజాప్రతినిధులు ప్రతిష్టాత్మకంగా చేపట్టారు.దీంతో ఈ కార్యక్రమాల నిర్వహణ గురించి ప్రతీ గ్రామంలో విస్తృత ప్రచారం జరిగింది.వారు విస్తృతంగా నిర్వహించిన ప్రచారం వల్ల పెద్ద సంఖ్యలో యువత ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుంటున్నారు.ఈ జాబ్ మేళా కార్యక్రమాలను ఏప్రిల్ 21వ తారీఖున మధిర నుంచి ప్రారంభించారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కమల్లు సారథ్యంలో నిర్వహించిన ఈ జాబ్ మేళాలో 5,000 మంది పాల్గొనగా 2,300 మందికి ఉద్యోగాలు లభించాయి.అదే నెల 27వ తారీఖున భూపాలపల్లిలో స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సారథ్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో 3,500 మంది పాల్గొనగా 2,000 మందికి ఉద్యోగాలు లభించాయి.మే18వ తేదీన గోదావరిఖనిలో నిర్వహించిన జాబ్ మేళాలో 5,100 మంది నిరుద్యోగ యువత పాల్గొనగా 3,029 మందికి ఉద్యోగాలు లభించాయి.స్థానిక ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు హర్కర వేణుగోపాలరావు,సంస్థ ఛైర్మన్ ఎండీ ఎన్. బలరామ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.మే 24వ తారీఖున వైరా పట్టణంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు నేతృత్వంలో భారీగా నిర్వహించిన జాబ్ మేళా కార్యక్రమంలో 12,000 మందికి పైగా పాల్గొనగా 4,041 మందికి ఉద్యోగాలు లభించాయి.ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్,సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్ తదితరులు పాల్గొన్నారు. కాగా అక్టోబర్ 25వ తారీఖున రాష్ట్ర ఇరిగేషన్ శాఖా మాత్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి సారథ్యంలో హుజూర్ నగర్ లో నిర్వహించిన అతి పెద్ద జాబ్ మేళా కార్యక్రమంలో 20,500 మంది యువత పాల్గొన్నారు.వీరిలో 4,574 మందికి ఉద్యోగాలు లభించాయి.అలాగే 26వ తారీఖున ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో మొత్తం 14,318 మంది నిరుద్యోగ యువత పాల్గొనగా వీరిలో 4,611మందికి ఉద్యోగాలు లభించాయి. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామ్ రెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. అదే రోజు బెల్లంపల్లిలో జరిగిన మెగా జాబ్ మేళా కార్యక్రమంలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డంవినోద్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.6,547 మందికి పైగా నిరుద్యోగ యువత ఈ కార్యక్రమానికి తరలిరాగా 3,095 మందికి ఇక్కడ ఉద్యోగాలు లభించాయి.

**సింగరేణి ఏర్పాట్లపై సర్వత్రా హర్షం**

సింగరేణి సంస్థ తన సామాజిక బాధ్యత కార్యక్రమాల్లో భాగంగా ఈ భారీ మెగా జాబ్ మేళా కార్యక్రమాలకు సంపూర్ణ సహకారం అందించింది. స్టాల్స్ ఏర్పాటు ప్రచారం భోజనం హైదరాబాద్ నుంచి విచ్చేసిన ప్రైవేటు కంపెనీల ప్రతినిధులకు సౌకర్యాలు,మంచినీటి వసతి సింగరేణి అధికారులు, ఉద్యోగులు సింగరేణి సెక్యూరిటీ రెస్క్యూ విభాగం వారి సేవలను ప్రజాప్రతినిధులు,హాజరైన నిరుద్యోగ యువత ప్రత్యేకించి కొనియాడారు. సింగరేణి సంస్థ భవిష్యత్తులో కూడా సింగరేణి ప్రాంతాలు,పరిసర ప్రాంతాల్లో నిర్వహించే సామాజిక బాధ్యత కార్యక్రమాలకు పూర్తిస్థాయిలో సహకారం అందిస్తుందని సంస్థ ఛైర్మన్ ఎండీ ఎన్. బలరామ్ తెలిపారు.ప్రత్యేకంగా ఉద్యోగ మేళాలకు సంస్థ సంపూర్ణ సహకారం అందించనుందని, తద్వారా స్థానిక యువతకు, రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి సింగరేణి తన వంతు సహకారం అందిస్తుందని పేర్కొన్నారు.త్వరలోనే కొత్తగూడెం, ఇల్లందు, మణుగూరు,ఆసిఫాబాద్ తదితర ప్రాంతాల్లో మెగా ఉద్యోగ మేళాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వెల్లడించారు.

# అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి




**కోస్గి పట్టణ అభివృద్ధి పనులపై కలెక్టర్ సమీక్ష..**

**నారాయణపేట,అక్టోబర్28(సూర్యరేఖ)** కోస్గి పట్టణ సమగ్ర అభివృద్ధి కోసం కడ, టీయూఎఫ్ఐడీసీ నుంచి మంజూరైన రూ.350 కోట్ల నిధులతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులలో వే గం పెంచాలని జిల్లా కలెక్టర్ సిక్తా ప ట్నాయక్ అధికారులను ఆదేశించా రు. మంగళ వారం కలెక్టర్ కోస్గి ము న్సిపాలిటీ కార్యాలయం లో పట్టణ అభివృద్ధి పనులపై ప్రజా ఆరోగ్య శా ఖ, మున్సిపల్, రెవెన్యూ శాఖ అధి కారులతో సమీక్ష జరిపారు.పట్టణం లో నిర్మించే భూగర్భ డ్రైనే జీ వ్యవ స్థ, తుఫాను నీటి కాలువలు, ప్రధా న లింక్ రోడ్లు, అంతర్గత సిసి రోడ్లు, నీటి సరఫరా పైపు లైన్ల పనుల పు రోగతి పై చర్చించారు. ప్రస్తుతం వా టి నిర్మాణ పనుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాన్ని మూడు జోన్లుగా విభజించి చేపడుతున్నట్లు పబ్లిక్ హెల్త్ ఈఈ విజయ్ భాస్కర్ గూగుల్ మ్యాప్ తో కోస్గి పట్టణస్వరూపం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించే మూడు జోన్ల గురించి మ్యాప్ ద్వారా కలెక్టర్ కు క్లుప్తంగా వివరించారు.అనంతరం కలెక్టర్ పట్టణంలో యుజిడి లేయింగ్ ఏరియా,డంపింగ్ యార్డ్,ప్రధాన లింక్ రోడ్లు,సైన్స్ మ్యూజియం బిసికాలనీలోని పార్కుల ప్రతిపాదిత స్థలాలను పరిశీలించారు.సంపల్లి శివాలయం ఆలయప్రాంతాన్ని సందర్శించారు. ఇప్పటికే ప్రారంభించిన అభివృద్ధి పనులను త్వరిత గతిన పూర్తిచేయాలని, ఇంకా ప్రారంభంకాని పనులను వెంటనే ప్రారంభించాలని ఈ సందర్భంగా మున్సిపల్ ప్రజా ఆరోగ్యశాఖ అధికారులకు కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిప ల్ కమిషనర్ నాగరాజు, తహసిల్దార్ బక్క శ్రీనివాస్, ఇంజినీర్ జ్ఞానేశ్వర్,వర్క్ఇన్స్ పెక్టర్ బాల్ రామ్ పాల్గొన్నారు.



## ధన్వాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు..



**ధన్వాడ,అక్టోబర్28(సూర్యరేఖ)** మండల కేంద్రమైన ధన్వాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో పలు అంశాలపై విద్యార్థులకు వివరించారు.ఎంపీఈఓ వెంకటేశ్వర్ రెడ్డి విద్యార్థులకు పలు అంశాలపై వివరిస్తూ విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ తో పాటు అధ్యాపక బృందం నెహ్రూ యువ కేంద్రం కోఆర్డినేటర్ కొండయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు.

## ఇసుక తీయడం బ్రిడ్జీకి ముప్పే..



**ముస్తాబాద్,అక్టోబర్29(సూర్యరేఖ)**ఆవునూర్ వాగు దాటాలంటే ప్రయాణికులు 2002 సంవత్సరం వరకు ఎడారిలో ప్రయాణించినట్టు ఉండేది,ప్రయాణికులు నరకయాతన అనుభవించే వారు,3సంవత్సరాలు కష్టపడి నిర్మించిన బ్రిడ్జికి,బ్రిడ్జి కిందనే ఇసుక తీయడం ప్రయాణికులకు శాపంగా మారుతోంది.బ్రిడ్జి కింద ఇసుక తీయడం ఎంత ప్రమాదమని తెలిసి కూడా అదే బ్రిడ్జి కింద ఉన్న పిల్లర్లు తేలే వరకు ఇసుక తీయడం బ్రిడ్జి కూలిపోయే ప్రమాదం దగ్గరలోనే ఉందని చెప్పవచ్చు..గతంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బ్రిడ్జి కింద ఇసుక తీయడం ఆపేశారు.నేడు దానిని మరల పున:ప్రారంభించారు.ఒకే నెంబర్ పై మూడు ట్రాక్టర్ లను నడుపుతుండటం ఆశ్చర్యానికి గురి చేస్తుందని, లైసెన్స్ లేని డ్రైవర్లు,అధిక వేగంతో పోవడం వలన గతంలో చాలా ప్రమాదాలు జరిగాయి. నిమ్మకు నీరెత్తినట్టు వ్యవవరిస్తున్నారని,ముస్తాబాద్ మండల ప్రధాన రహదారి అయిన అవునూర్ బ్రిడ్జికి 100 నుండి 200 మీటర్ ల వరకు ఇసుక తియ్యొద్దనే ప్రభుత్వ నిబంధనను తుంగలో తొక్కుతున్నారని ముస్తాబాద్ భాజపా మండల అధ్యక్షులు సౌల్ల క్రాంతి అన్నారు.

## ఎంబిబిఎస్ సీటు సాధించిన ఉద్యమ నాయకుడి కూతురు..




**నారాయణపేట,అక్టోబర్28 (సూర్యరేఖ)** నారాయణపేట మండలం కోటకొండ గ్రామానికి చెందిన బి.యాదగిరి ప్రజాఉద్యమాల నాయకుడు ప్రజల కోసం నిరంతరం పోరాడేవ్యక్తి,రైతాంగం తరుపున రైతుల కోసం నిరంతరం పోరాడే వ్యక్తి,తన కూతురు బి.స్వప్న,ఎంబిబిఎస్ బి.స్పందన ఎంబిబిఎస్ సీట్ సురభి కాలేజ్ సిద్దిపేట్ లో సాధించడం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేశారు.అలాగే గ్రామంలో పలువురు అభినందించారు.ఒక వైపు ప్రజా ఉద్యమాల్ని కొనసాగిస్తూ పిల్లల్ని చదివించడం గొప్ప విషయం అని,పలువురు అభినందిస్తున్నారు, పిల్లలు కష్టపడితే మీరు కోరుకున్న జీవితంలో స్థిర పడడం జరుగుతుంది,అలాగే తల్లిదండ్రుల పేరును నిలబెట్టిన ఆరవతారని అలాగే గ్రామానికి మన జిల్లాకు మంచి పేరు వస్తుందని,నేటి యువతఆవిధంగా రాణించాలని పిల్లల తల్లిదండ్రులు కచ్చితంగా ప్రోత్సహించాలని అన్నారు.

# అయ్యప్ప మాలదారణం... సకలపాపహరణం

స్వామియే శరణమయ్యప్ప అనే శరణుఘోష వినిపించే రోజులు..
కఠోర దీక్షలో నియమావళిని ఆచరిస్తూ స్వామి సేవలో తరించే ఘడియలివి..
కార్తీక మాసంలో భక్తులు ధరించే మాల అయ్యప్ప స్వామి మాల..
హరిహరాదులకు అత్యంత ప్రీతికరమైన మాసం కార్తీక మాసం..
శరీరాన్ని, మనస్సును చెడు నుంచి మంచి మార్గం వైపు మళ్లించే అయ్యప్పస్వామి దీక్ష..
41 రోజుల తర్వాత శబరిమల అయ్యప్పస్వామి సన్నిధికి మాలదారులు..





“స్వామియే..శరణమయ్యప్ప అనే శరణుఘోష వినిపించే రోజులు వచ్చేశాయి.అయ్యప్ప నామంతో భక్తకోటి పులకించే సమయమిది. కఠోర దీక్షలో నియమావళిని ఆచరిస్తూ స్వామి సేవలో తరించే ఘడియలివి.అయ్యప్ప దీక్షలు చేపట్టేందుకు భక్తులు సిద్ధమవుతున్నారు.ఇప్పటికే మండలంలో అనేక మంది అయ్యప్ప మాల ధరించి స్వామి పూజలో మునిగి తేలుతున్నారు. కార్తీక మాసం వచ్చిదంటే చాలు హిందూ సంప్రదాయంలో ఎక్కువగా అయ్యప్ప స్వామి మాలధారణ చేస్తుంటారు.ఈ నేపథ్యంలో అయ్యప్ప మాలధారణ మొదలుకొని,దీక్షా విధానం, దీక్ష పూర్తయి తిరిగి వచ్చే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర నియమాలన్నింటిపై ‘సూర్యరేఖ’ దినపత్రిక అందిస్తున్న ప్రత్యేక కథనం..

**చేగుంట,అక్టోబర్28(సూర్యరేఖ)** హరిహరాదులకు అత్యంత ప్రీతికరమైన మాసం కార్తీక మాసం.ఈ మాసమంతా ఆలయాలు నిత్య పూజలతో,భక్తులతో,దీక్ష తీసుకున్న అయ్యప్ప స్వాములతో సందడిగా కన్పిస్తాయి. ఊరురా... వాడ వాడలా అయ్యప్ప శరణుఘోష వినిపిస్తుంది. “స్వామియే శరణమయ్యప్ప” అంటూ భక్తకోటి శబరిమల వైపు అడుగులు వేసేందుకు దీక్ష పూనుకున్నారు. శరీరాన్ని మనస్సును చెడు నుంచి మంచి మార్గం వైపు మళ్లించేవే ఈ దీక్ష దాంట్లో భాగంగా ఈ మాసంలో స్వామియే శరణం అంటూ అయ్యప్ప మండల దీక్ష మార్గాన్ని అన్వేషించేవారు, సన్మార్గంలో జీవన యాత్ర సాగించాలనుకునే వారు విధిగా జీవితకాలంలో ఒక్కసారైనా శబరిమలై యాత్ర చేసి అయ్యప్పను దర్శించుకోవాలని ఆకాంక్షిస్తుంటారు.

### అయ్యప్పను సేవించే విధానం..

అయ్యప్ప స్వామిని నవవిధ సేవలతో పూజిస్తుంటారు.నవ విధాలు అంటే శ్రవణం కీర్తనం, స్మరణం పాదసేవనం అర్చనం నమస్కారం,ధ్యానం, సుకృతం ఆత్మ నివేదన. స్వామిదీక్షలో ఇరుముడికి మహా విశిష్టత ఉంటుంది.ఇరుముడిలో రెండు ముడులుంటాయి.ఒక ముడిలో అయ్యప్ప స్వామి స్వరూప ముద్ర కొబ్బరికాయ,స్వామివారికి సమర్పించే వస్తువులు ఉంటాయి. కొబ్బరికాయలను స్వచ్ఛమైన ఆవునెయ్యితో నింపుతారు.ఈ నెయ్యి జ్ఞానానికి ప్రతీక. కొబ్బరికాయలను బిగించడం వైరాగ్యానికి చిహ్నంగా భావించి మూతపెడతారు. కాయను ఆత్మ అనే లక్కతో సీజ్ చేస్తారు. మనస్సులోని జ్ఞానాన్ని సంపూర్ణంగా అయ్యప్పకు నిండు మనస్సుతో అర్పించుకున్నట్లు భావిస్తారు. దీనినే ఆత్మనివేదన అంటారు.అయప్పస్వామి దీక్షలో పరమార్థం కూడా ఇదే. రెండో ముడి వెనుక భాగంలో ఉంటుంది.ఇందులో బియ్యం,బెల్లం అటుకులు, కూరగాయలు,పూజా సామగ్రి ఉంచుతారు.బియ్యం, కూరగాయలు పెద్ద పాదంలో పర్యటిస్తున్న సమయంలో వంట కోసం,పూజా సామగ్రి పర్యటన సమయంలో పూజ కోసం స్వాములు ఉపయోగించాల్సి ఉంటుంది.

### ఏటేటా కన్నె స్వాములు...

శబరి కొండల్లో ఉండే మాలికాపురోత్తమ దేవి అయ్యప్పస్వామిని ప్రేమిస్తుంది.పెళ్లి చేసుకోమ్మని కోరుతుంది.ఇది విన్న స్వామి వారు చిరునవ్వుతో తిరస్కరిస్తాడు.అయినా ఆమె పట్టు వీడదు.దీంతో కన్నెస్వాములు తన మాల ధరించి రానప్పుడు వివాహమాడుతానని స్వామి ఆమెకు మాటిస్తాడు. అయితే అది ఎప్పటికీ జరగనిదని పరమార్థం. ఇందులో భాగంగానే కన్నె స్వాముల సంఖ్య ప్రతి సంవత్సరం పెరుగుతూ వస్తోంది.దీక్ష మొదటిసారి చేపట్టేవారు కన్నెస్వాములు,తరువాత వరుసగా కత్తి స్వామి గంటస్వామి గధాస్వామి గురుస్వాములుగా పిలుస్తారు.తొమ్మిది నుంచి18 సార్లు శబరిమలై యాత్రకు వెళ్లివచ్చిన వారు కన్నెస్వాముల దీక్ష చేపట్టేందుకు సహకరిస్తారు.

### పడిపూజ ఎందుకు..?

అయ్యప్ప సన్నిధానంలో 18 మెట్లు ఉంటాయి. ఇవి కామ,క్రోధ..మొద లైన అరిషడ్వర్గాలని ప్రతీతి. మనిషిలోని18 రకాల చెడుగుణాలు తొలగిపోవటానికి దీక్షలో పడిపూజ నిర్వహిస్తారు. అయ్యప్పను దర్శించిన ప్రతిసారి చెడు లక్షణాల్ని విడిచిపెట్టి మంచివాడిగా మారాలని కోరుకుంటూ ఈ పూజ నిర్వహిస్తారని గురుస్వాములు చెబుతారు.

### ఇరుముడి అత్యంత ప్రాధాన్యం..

దీక్షలో 41రోజుల తర్వాత వేసే ఇరుముడికి అత్యంత ప్రాధాన్యత ఉంటుంది.ఇరు అంటే రెండు అని అర్థం. అనగా రెండు ముడులు అని, ముందు (మో) ముడిలో పీటం భస్మం గంధం, కొబ్బరి కాయలు,నెయ్యి,పూజా సామగ్రి ఉంటాయి.వెనుక ముడి(రెండో) ప్రయాణానికి కావాల్సిన వస్తువులు ఉంటాయి.వీటినే పుణ్యపు మూట,పాపపు మూటగా పిలుస్తారు.

### తల స్నానం..

అభ్యంగన స్నానం దేవునికి ప్రీతిపాత్రం. అయ్యప్ప మాల ధరించిన ప్రతి ఒక్కరూ ఉదయం, మధ్యాహ్నం,సాయంత్రం తప్పక చల్లటి నీళ్లతో తలంటు స్నానం చేయాల్సిందే.దీంతో మనసుకు హాయినిస్తుంది. చెడు భావనలను దూరం చేసి దైవత్వం వైపు ఏకాగ్రత కుదురుతుందనేది భావన.

### నల్లని వస్త్రాలే ఎందుకంటే..

దీక్షలో ఉన్న భక్తులు నల్లని వస్త్రాలు ధరించడంపై ఓ పురాణ కథ ప్రచారంలో ఉంది.ఒకానొక సందర్భంలో అయ్యప్ప స్వామి శనీశ్వరున్ని వరం కోరుతాడు. తన భక్తుల వద్దకు శని రాకుండా,ఎలాంటి కష్టాలు రాకుండా చూడాలని కోరడంతో అప్పుడు శనీశ్వరుడు తనకు ఇష్టమైన నల్లని వస్త్రాలు ధరించిన భక్తుల వద్దకు తాను (శని) వెళ్లనని చెప్తాడు.అందుకే భక్తులు శనీశ్వరునికి ఇష్టమైన నల్లరంగు వస్త్రాలు ధరిస్తారని గురుస్వాములు చెప్తారు.అయితే నల్లని వస్త్రాలు ధరించటం వల్ల లాభాలు కూడా కొన్ని ఉన్నాయని శాస్త్ర జ్ఞానం చెప్తోంది.దీక్ష చలికాలంలో వస్తుంది.నల్లని రంగు వేడిని స్వీకరిస్తుంది.శరీరానికి వెచ్చదనం ఇస్తుంది. దుమ్మూధూళి సైతం నిలువదు.శబరిమల కొండలపై స్వామిని దర్శించుకునేందుకు అడవిలో కాలినడకన వెళ్లాలి.అందువల్ల రాత్రుల్లో జంతువుల నుంచి రక్షణ కూడా ఈ వస్త్రాలు సహకరిస్తాయి.

### అలంకరణ..

అయ్యప్పకు నిండుగా అంకరణ చేసుకున్న స్వాములంటే ఇష్టం.ముఖ్యంగా మణికంఠులు ఒళ్లంతా చందనం బొట్లు పెట్టుకుని అలంకరించుకుంటే అయ్యప్ప స్వామికి మహా



ప్రీతి అని గురుస్వాములు చెపుతుంటుంటారు. మాల ధరించిన నాటి నుంచి దీక్షా సమయం ముగిసి తిరిగి మాల విసర్జన చేసే సమయానికి కూడా దీక్షా పరుడి నుదిటిన చందనం బొట్టు ఉండాలి.చందనం బొట్టుకు తోడుగా కుంకుమ, విభూధి,గంధంలలో ఏదో ఒకదానిని పెట్టుకుంటారు.

### 41రోజుల తరువాత శబరిమల అయ్యప్ప స్వామి దేవాలయానికి..

అయ్యప్ప మాలధారణలో ఒక్కోమాలకు ఒక్కో ప్రాముఖ్యత ఉంటుంది.మొదటగా వేసుకునే వారిని కన్నెస్వామి అని నాలుగో సారి మాల వేసుకునే వారిని గద స్వామి,ఐదోసారి మాల వేసుకునేవారిని పేరుస్వామి,6వ సారి వేసుకుంటే గురుస్వామిగా పిలుస్తారు.ఐతే ఇందులో గురు స్వామికి ప్రత్యేకమైన స్థానం ఉంటుంది. గురుస్వామి అనే వారికి భక్తి భావం అలాగే ఓపిక పూజలు,భజనలు వచ్చి ఉండాలి.ఈ గురు స్వామీ లేనిదే మిగతా స్వాములు అయ్యప్ప మాలలు వేసుకోరాదు. గురుస్వామి పర్యవేక్షణలో మాత్రమే మిగతా స్వాములు మాలధారణ చేసుకోవాలి. మాల వేసుకున్న మొదటి రోజు నుండి విరమణ వరకు గురుస్వామి చెప్పినాదే శాసనం.41 రోజుల తరువాత శబరిమల అయ్యప్ప స్వామి దేవాలయానికి వెళ్ళడానికి ముందు గురుస్వామి చేతనే ఇరుముడి కట్టుకొని వెళ్ళాలి.ఒకవేల ఆలా చేయని యెడల అది అపచారం అని చరిత్ర చెబుతుంది.ఇలా ప్రతి విషయంలో గురుస్వామి లేనిదే..మిగతా స్వాములు ఏ పనిచేయరాదు.

### నియమాల అయ్యప్పమాల..

అయ్యప్ప మాలాధారణ చేసిన భక్తులు 41వ రోజుల పాటు(మండలం రోజులు) నియమ నిష్టలు పాటించాలి.ఇరుముడితో శబరిమల సన్నిధానం చేరి స్వామిదర్శనం చేసుకోవడంతో దీక్ష ముగుస్తుంది. 108 తులసీ రుద్రాక్ష ఎర్రచందనం,స్పటిక,మాలతో దీక్ష చేపట్టి ఒకటి ఉపమాలగా,ఏవైనా రెండు మాలలు వాటికి మధ్యలో స్వామి అయ్యప్ప లాకెట్ ధరించాలి. ప్రతిరోజూ సూర్యోదయానికి ముందు, అస్తమయం తర్వాత చన్నీటితో స్నానం చేయాలి. ఉదయం,మధ్యాహ్నం భిక్ష సమయంలో సాయంత్రం నిత్యపూజ ప్రత్యేక పీటం ఏర్పాటు చేసుకొని పూజ చేయాలి. సన్నిధానంలోనైనా చేయవచ్చు.నిత్యం ఉతికిన నల్లని వస్త్రాలనే ధరించాలి.దీక్షను చేపట్టేముందు కనీసం మూడు రోజుల ముందు సాత్వికాహారం తీసుకోవాలి.దీక్షా కాలంలో తల, గడ్డం వెంట్రుకలు,గోళ్లను కత్తిరించకూడదు. పాదరక్షలు ధరించరాదు.దీక్షా సమయంలో ఒకసారి కనీసం తమ శక్తికొద్దీ ఐదుగురు స్వాములకైనా భిక్షపెట్టాలి. మధ్యాహ్నం ఒకపూట భిక్ష (భోజనం) చేయాలి.రాత్రి అల్పాహారం తీసుకోవాలి.అహింస, సత్ప్రవర్తన, క్రమశిక్షణ ఇంద్రియనిగ్రహం, బ్రహ్మచర్యం కపటం లేకుండా ఉండాలి.మత్తు పానీయాలు తీసుకోకూడదు.ధూమపానం చేయవద్దు.దీక్షా సమయంలో కటిక నేలపై నిద్రించాలి. పురుషులు నాలుగేళ్ల వయస్సు నుంచి వృద్ధాప్యం వరకు ఈ దీక్ష చేపట్టవచ్చు.. మహిళలయితే 10 సంవత్సరాల పిల్లలు,50 ఏళ్ల పైబడిన వారు దీక్షను ఆచరించవచ్చు.దీక్ష చేపట్టని సందర్భాలు కుటుంబంలో తల్లి,తండ్రి మరణిస్తే ఏడాది పాటు మాల ధరించకూడదు. ఇంట్లో స్త్రీ ఏడో నెల గర్భిణి అయితే మాల వేసుకోవద్దు.భార్య మరణిస్తే ఆరు నెలల పాటు దీక్షకు దూరంగా ఉండాలి.దీక్ష మధ్యలో అవాంతరాలు,అశుభాలు ఎదురైనా విదేశాలకు వెళ్లాల్సిన అవసరం ఏర్పడినా గురుస్వామిని సంప్రదించాలి.

## ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి..

రంగారెడ్డి జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్



**రాజేంద్రనగర్,అక్టోబర్28(సూర్యరేఖ)** ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా దృష్టి సారించడం జరుగుతుందని రంగారెడ్డి జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ అన్నారు.మంగళవారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శివరాంపల్లి శ్రీకృష్ణనగర్ కాలనీలో గత మూడు సంవత్సరాల నుండి చిన్నపాటి వర్షానికి డ్రైనేజీ పొంగిపొర్లి ఇంట్లోకి నీళ్లు వస్తుండటంతో ఆయన జలమండలి డజీఎం జోహార్ తో మాట్లాడి సమస్యకు పరిష్కారం చూపారు.ఈ సందర్భంగా వై.శ్రీధర్ మాట్లాడుతూ...స్థానికంగా మురికి నీరు నిండిపోయి దోమలు,ఈగలతో ప్రజలంతా కూడా అనారోగ్యానికి గురవుతున్నారన్నారు.ఈ విషయాన్ని జలమండలి డీజీఎం జోహార్ దృష్టికి తీసుకురావడంతో వెంటనే వారి సిబ్బందిని హైటెక్ మిషన్ ద్వారా పంపి క్లీన్ చేయించినట్లు వివరించారు.బస్తీ పాత లైను ఎస్టిమేషన్ చేసి కొత్త లైన్ వేయుటకు మెజర్మెంట్ తీసుకున్నారన్నారు.ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక బిజెపి డివిజన్ మాజీ అధ్యక్షులు తిరుమలేష్, మహిళా మోర్చా నాయకులు అంబికా,తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి పేదలకు వరం..

ఎమ్మెల్సీ అంజిరెడ్డి



**అందోల్,అక్టోబర్28(సూర్యరేఖ)** సీఎం సహాయనిధి పేదలకు వరమని పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు.సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం హస్నాబాద్ గ్రామం నిరుపేద కుటుంబానికి చెందిన చాకలి వెంకటేశం అనారోగ్యంతో బాధపడుతుండటంతో అతనికి రూ.23,500 చెక్కును ఎమ్మెల్సీ అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాయికోడ్ మండలం నుంచి అర్హులకు సీఎం సహాయ నిధి అందేలా చూస్తామన్నారు.పేదకుటుంబాలకు చెందినవారు అనారోగ్యం పాలైతే ఎంత ఇబ్బందులు పడతారో తనకు తెలుసునన్నారు.ఇలాంటావారు కార్పొరేట్ వైద్యం చేయించుకోవాలంటే ఎంతో ఖర్చుతో కూడుకున్నదన్నారు.పేదల ఆరోగ్య పరిరక్షణకు సీఎం సహాయనిధి వరంలాంటిదన్నారు. ఎంతోమంది పేదలు అధునాతన వైద్యసేవలను పొంది సీఎం సహాయ నిధి ద్వారా చేయూతను అందుకుంటున్నారన్నారు.ఆపదలో ఉన్న వారికి సీఎం సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరంగా మారిందన్నారు. బాధితుని గోడును ప్రభుత్వానికి వివరించిన మండలం పార్టీ బీజేపీ అధ్యక్షులు నాగరాజ్ ముదిరాజును అభినందించారు.

## విద్యార్థులకు మంచి విద్యను అందించడమే లక్ష్యం..

నారాయణస్కూల్ లో ఎస్ఎల్ సి కార్యక్రమం




**జల్ పల్లి,అక్టోబర్28 (సూర్యరేఖ)** నారాయణ స్కూల్ లో చదువుతున్న విద్యార్థులకు మంచి విద్యను అందించడమే లక్ష్యంగా స్కూల్ యాజమాన్యం కృషి చేస్తుందని స్కూల్ జిఎం. గోపాల్ రెడ్డి,ఏజీఎం రవీంద్రబాబు అన్నారు. జల్ పల్లి మున్సిపాలిటీ శ్రీరామకాలనీ నారాయణ స్కూల్ లో మంగళవారం స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ (ఎస్ఎల్ సి) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి నారాయణ స్కూల్ జి.ఎం.గోపాల్ రెడ్డి,ఏజి ఎం.రవీంద్రబాబు ముఖ్యఅతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థులకు విద్యా బోధనలు సులభంగా అర్థమయ్యేటట్టు ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తారని,అలాంటి విద్యను నారాయణ స్కూల్ ఉపాధ్యాయులు విద్యార్థులకు ఎంతో శ్రద్ధగా విద్యార్థులకు విద్యాబోధనలు నేర్పిస్తున్నారని అన్నారు.అటువంటి విద్యా బోధన వలన విద్యార్థులలో విషయ పరిజ్ఞానం, ఆత్మవిశ్వాసం కమ్యూనికేషన్ నైపుణ్యం పెరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ రవికుమార్,ఈ ఛామ్స్ ఆర్అండ్ డి మహేశ్వరి కోఆర్డినేటర్ దివ్య స్నేహ ఉపాధ్యాయులు విద్యార్థులు,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

**ఆర్డీఓ జయచంద్రరెడ్డి**
**ప్రభుత్వ పథకాల గురించి రైతులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలి..**
**రెవెన్యూ,వ్యవసాయ,గ్రామపంచాయతీ అధికారులతో ఆర్డీఓ సమావేశం..**





**మాసాయిపేట,అక్టోబర్28(సూర్యరేఖ)**మండలంలోని రైతు వేదికలో రెవెన్యూ,వ్యవసాయ శాఖల అధికారులు గ్రామపంచాయతీ కార్యదర్శులతో తూప్రాన్ ఆర్డీఓ జయచంద్రారెడ్డి మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రైతులు పండించిన పంట కొనుగోలు కేంద్రంలో ఎప్పటికప్పుడు రైతుల సమస్యలు పూర్తి చేయడంతో పాటు రైతులు సూచించే సూచనలు,ప్రభుత్వ పథకాల వివరాలు రైతులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలన్నారు.రైతులు ఎలాంటి ధర్నాలు చేయకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు.దీంతో పాటు రైతులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు విత్తన కంపెనీల మోసాలు దళారుల నుంచి జాగ్రత్తలు,రైతులకు మండల స్థాయిలో అందుబాటులో ఉన్న సేవల గురించి ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ జ్ఞాన జ్యోతి,డిప్యూటీ తహసీల్దార్ వసంత,రెవెన్యూ ఇన్స్పెక్టర్ ధన్ సింగ్, పీఏసీఎస్ చైర్మన్ ఊదండపురం నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యమే మహాభాగ్యం..సమాజ సేవ ముందంజలో ఆర్‌విఎం వైద్య బృందం

ఆర్‌విఎం వైద్య బృందం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం విజయవంతం..
రక్తపోటు,మధుమేహం,కంటి పరీక్షలు,దంత పరీక్షలు, తదితర ఆరోగ్య పరీక్షలు నిర్వహణ..
కాలనీవాసులకు ఉచితంగా మందులు పంపిణీ, కెసిఆర్ కాలనీ ప్రజల్లో సంతోషం వెల్లివిరిసింది..
ప్రతి కుటుంబం ఆరోగ్యవంతంగా ఉండటమే మా లక్ష్యం" ..వైద్యులు,నిర్వాహకుల వ్యాఖ్య..
కాలనీవాసుల ప్రశంసల నడుమ శిబిరం విజయవంతం..





**రామయంపేట,అక్టోబర్28(సూర్యరేఖ)**రామాయంపేట పట్టణ శివారులోని డబుల్ బెడ్‌రూమ్ కేసీఆర్ కాలనీలో ఆర్‌విఎం వైద్య బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది.కాలనీవాసుల ఆరోగ్య రక్షణను దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో వందలాది మంది ప్రజలు పాల్గొని వైద్య సేవలను పొందారు.శిబిరంలో డాక్టర్లు రమ్య,వినోద, శ్రేయాస్,లిఖిత,పావన తదితరులు ప్రజలకు వైద్యసేవలు అందించారు. వారు వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు చేసి రక్తపోటు,మధుమేహం,దంత పరీక్షలు, కంటి పరీక్షలు వంటి విభిన్న వైద్య విభాగాల పరిధిలో ఉచితంగా మందులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ మంచినీళ్ల లక్ష్మణ్,గణేష్ రెడ్డి,పవన్ కళ్యాణ్,కాలనీ అధ్యక్షుడు కట్ట ప్రభాకర్,రామాయంపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మద్దెల సత్యనారాయణ,రామాయంపేట ప్రెస్ క్లబ్ జనరల్ సెక్రెటరీ రాగి లింగం,జిల్లా సంయుక్త కార్యదర్శి మర్కు నగేష్,టిపిసిసి కార్యదర్శి చౌదరి సుప్రభాత్ రావు,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్ రెడ్డి, పోచమ్మల అశ్విని శ్రీనివాస్,అల్లాడి వెంకట్, పోచమ్మల గణేష్ ఇమ్రాన్ మేక్కొండ పోచయ్య,పెద్ద నరసింహులు చాంద్ పాషా,కైరం కొండ చంద్రం, ఎరుకల నరసింహులు,సిద్దు శివశంకర్,గుమగల వెంకన్న రాముడు,చారి,సత్యం,యాదవ్,అమీన్, రాములు రమేష్ తదితరులు పాల్గొని శిబిర విజయానికి తోడ్పడ్డారు.ఈ సందర్భంగా నాయకులు వైద్యులు మాట్లాడుతూ..ప్రతి కుటుంబం ఆరోగ్యవంతంగా ఉండటమే మా లక్ష్యం..కెసిఆర్ కాలనీ ప్రజల్లో ఆరోగ్య చైతన్యం పెంపొందించడానికి ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు మరింతగా నిర్వహిస్తామనీ తెలిపారు. కార్యక్రమం విజయవంతంగా ముగియడంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేస్తూ ఆర్‌విఎం వైద్య బృందానికి ధన్యవాదాలు తెలిపారు.

# రక్తదానం చేసి ఎదుటి వారి ప్రాణాలు కాపాడాలి





**చేగుంట పోలీస్ స్టేషన్ పరిధిలో రక్తదాన శిబిరం..**
**ముఖ్యఅతిథిగా హాజరైన మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్**



**చేగుంట,అక్టోబర్28(సూర్యరేఖ)**రక్తదానం చేసి తోటి వారి ప్రాణాలు కాపాడాలని మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ కోరారు. పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా మంగళవారం చేగుంట పోలీస్ స్టేషన్ పరిధిలో రక్తదాన శిబిరం నిర్వహించారు.ఆపదలో ఉన్నవారికి దాతల రక్తాన్ని అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమానికి అదనపు ఎస్పీ ఎస్.మహేందర్ ముఖ్యఅతిథిగా హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో చేగుంట పోలీస్ స్టేషన్ సిబ్బంది,స్థానిక యువత పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేసి సేవాభావాన్ని చాటారు. రక్తదానం చేసిన సిబ్బందిని మరియు యువతను అదనపు ఎస్పీ మహేందర్ ప్రశంసించి వారికి సర్టిఫికేట్లు అందజేశారు.అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ మాట్లాడుతూ...పోలీస్ అమరవీరుల ప్రాణ త్యాగాలను స్మరించుకుంటూ వారోత్సవాలను జరుపుకుంటున్నామన్నారు.పోలీసులంటే సేవకు, త్యాగానికి ప్రతీక అని తెలియజేస్తూ రక్తదానం కూడా ఆసేవలో అతిముఖ్యమైన భాగమని దీని ద్వారా కొందరి ప్రాణాలను కాపాడగలమని ఎస్పీ ఎస్.మహేందర్ తెలిపారు.పోలీసులు కేవలం శాంతి భద్రతలను పరిరక్షించడమే కాకుండా సేవా కార్యక్రమాల్లో కూడా ముందువరసలో ఉంటారు. ముఖ్యంగా రక్తదానంపై ఉన్న అపోహలను నమ్మకుండా ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలి.మనం చేసే రక్తదానం వలన అత్యవసర సమయంలో,ప్రమాద పరిస్థితుల్లో ఉన్నవారికి తలసేమియా వంటి వ్యాధిగ్రస్తులకు ఎంతో మేలవుతుంది. రక్తదానం ఒక మహత్తరమైన సేమఇది మనిషి ప్రాణాలను కాపాడే పవిత్రమైన కార్యం అని పేర్కొన్నారు.ఇలాంటి సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ చురుకుగా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తూప్రాన్ డిఎస్పి నరేందర్ గౌడ్ రామాయంపేట సి.ఐ.వెంకట రాజా గౌడ్ తూప్రాన్ సి.ఐ రంగా కృష్ణ,ఎస్ఐలు చైతన్యరెడ్డి, శంకర్,సుభాష్ గౌడ్,రాజు,చేగుంట పోలీస్ స్టేషన్ సిబ్బంది,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి కలెక్టర్ నారాయణరెడ్డి



**రంగారెడ్డి జిల్లా,అక్టోబర్28(సూర్యరేఖ)** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో స్పష్టమైన పురోగతి పెంచాలని,క్షేత్రస్థాయిలో చిత్తశుద్ధితో పని చేయాలని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు.మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరం నుండి ఇందిరమ్మ ఇళ్ల పురోగతి,డబుల్ బెడ్రూంల పంపిణీ ప్రక్రియపై వనమహోత్సవం,ఎన్‌ఆర్ఇజిఎస్, పారిశుద్ధ్యం,తదితర అంశాలపై కలెక్టర్ నారాయణ రెడ్డి ఆర్డీవోలు,ఎంపీడీఓలు,ఎంపీఓలు,హౌసింగ్ ఏ.ఈలు మున్సిపల్ కమిషనర్లు,ఎపిఎమ్,లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఒక్కో మండలం వారీగా మంజూరైన ఇందిరమ్మ ఇళ్లు ఎన్ని,వాటిలో ఎన్ని గ్రౌండింగ్ అయ్యాయి,ఎన్ని ఇండ్లు ఏదశలో నిర్మాణంలో ఉన్నాయి,ఇప్పటి వరకు గ్రౌండింగ్ జరగని ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులచే పనులు ప్రారంభించేలా చేపట్టిన చర్యలు ఏమిటి తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఇండ్ల నిర్మాణం ఇంకా ప్రారంభం చేయని వాటిని వెంటనే ప్రారంభించాలని,మార్క్ అవుట్ చేసిన ఇండ్లను బేస్మెంట్ లెవల్ కు తెచ్చేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలిపారు.నిజమైన పేద లబ్దిదారులు ఇందిరమ్మ ఇండ్లను నిర్మాణం చేపట్టేలా చూడాలని సూచించారు.ఇళ్ల నిర్మాణాలలో వెనుకంజలో ఉన్న ఆయా మండలాల అధికారులు పూర్తి చేయాలని ఆయన సూచించారు.మంజూరీలు పొందిన వారందరూ తక్షణమే ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా లబ్ధిదారులను ప్రోత్సహిస్తూ,క్షేత్రస్థాయిలో పక్కాగా పర్యవేక్షణ చేయాలని సూచించారు.ప్రతి ఒక్కరూ ఇంటి నిర్మాణం పనులు చేపట్టేలా చూడాలని, ఇందిరమ్మ కమిటీల సహకారం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని ఆదేశించారు.వనమహోత్సవంపై సమీక్షిస్తూ ప్రతి గ్రామ,మున్సిపాలిటీ పరిధిలో అంగన్వాడి కేంద్రాలలో పాఠశాలల్లో ఇన్స్టిట్యూట్లో వైకుంఠ ధామాలలో,పల్లె ప్రగతి పార్కుల్లో నిర్దేశించిన లక్ష్యాలను 100 శాతం పూర్తి అయ్యేలా మొక్కలు నాటాలని సూచించారు. నాటిన మొక్కలను పరిశీలించుటకు టీంలు ఏర్పాటు చేసి నవంబర్ 1వ తేది నుండి పరిశీలించడం జరుగుతుందన్నారు.నిర్దేశించిన లక్ష్యాలను 100శాతం పూర్తి చేయని వారిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సూచించారు.ప్రధాన మంత్రి ఆవాస్ యోజనా గ్రామీణ పథకం ద్వారా చేపట్టిన ఇండ్ల నిర్మాణాలపై సమీక్ష నిర్వహించారు.జిల్లాలోని పాఠశాలలో గురుకులాలలో,అంగన్వాడీ కేంద్రాల్లో త్రాగునీటి సమస్య లేకుండా చూడాలని,ప్రతిరోజు పారిశుధ్యం చేపట్టాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలల్లో గురుకులాలలో మరమ్మతులు చేపట్టవలసిన మరుగుదొడ్లకు మరమ్మతులు చేపట్టాలని,కొత్తగా నిర్మించే దగ్గర మరుగుదొడ్లను నిర్మించాలని,అందుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్,జెడ్పి సీఈవో కృష్ణారెడ్డి,జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ పిడి శ్రీలత,డీపీఓ సురేష్ మోహన్,సివిల్ సప్లై అధికారి వనజాత,విద్యాశాఖ అధికారి సుశిందర్ రావు,ఉద్యానవనశాఖ అధికారి సురేష్,ఆర్డీవోలు ఎంపీడీవోలు మున్సిపల్ కమిషనర్లు,సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ అమరుల త్యాగాలు వెలకట్టలేనివి..

**ఏసీపి జానకి రెడ్డి**
**పహాడిషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీస్ అమరుల సంస్మరణ ర్యాలీ**






**జల్ పల్లి,అక్టోబర్28 (సూర్యరేఖ)** విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని మహేశ్వరం ఏసీపి జానకిరెడ్డి అన్నారు. రాచకొండ కమిషనర్ జి. సుధీర్ బాబు ఆదేశాల మేరకు మంగళవారం పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధి తుక్కుగూడ ఓఆర్ఆర్ వంతెన నుండి అయ్యప్పస్వామి ఆలయం వరకు పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ మహేశ్వరం ఏసిపి జానకిరెడ్డి పహాడీషరీఫ్ ఇన్స్పెక్టర్ ఎస్.రాఘవేందర్ రెడ్డి,ఎస్సైలు వందమంది పోలీసులతో కలిసి పోలీస్ అమరుల సంస్మరణ ర్యాలీనీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఏసీపి మాట్లాడుతూ...సమాజం కోసం, శాంతి భద్రతల పరిరక్షణలో అసువులు బాసిన పోలీస్ అమర వీరుల త్యాగాలు వెలకట్టలేనివని, సమాజం ఎల్లవేళల వారికి రుణపడి ఉంటుందని తెలిపారు.శాంతి భద్రతలు అదుపులో ఉన్నప్పుడే ప్రజలు సుఖసంతోషాల తో ఉంటారని అన్నారు.ఈ కార్యక్రమంలో పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ ఎస్ఐలు బి.దయాకర్ రెడ్డి,మొహమ్మద్ పైసల్ అహ్మద్,వి. లక్ష్మయ్య ఎల్.వెంకటేశ్వర్లు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





# రవితేజ, నవీన్ పొలిశెట్టి కాంబోలో సినిమా

మాస్ జాతర సినిమాతో మూవీ లవర్స్‌కు పక్కా వినోదాన్ని అందించేందుకు రెడీ అవుతున్నాడు టాలీవుడ్ యాక్టర్ రవితేజ. శుక్రవారం మాస్ జాతర పెయిడ్ ప్రీమియర్ వేయనున్నారు. ఈ చిత్రంతోపాటు కిశోర్ తిరుమల దర్శకత్వంలో కూడా ఆర్‌టీ 76 ప్రాజెక్టును చేస్తున్నాడు. ఈ మూవీ 2026 సంక్రాంతి రిలీజ్‌కు రెడీ అవుతుంది. కాగా ఈ రెండు సినిమాలు విడుదల కాకముందే రవితేజ కొత్త మూవీకి సంబంధించిన ఆసక్తికర వార్త ఫిలింనగర్‌లో రౌండప్ చేస్తోంది. జాతి రత్నాలు, ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ సినిమాలతో సూపర్ ఫేం సంపాదించాడు యంగ్ యాక్టర్ నవీన్ పొలిశెట్టి. ఈ టాలెంటెడ్ యాక్టర్ నటిస్తోన్న అనగనగా ఒక రోజు 2026 సంక్రాంతికి విడుదల కానుంది. కాగా ఈ ఇద్దరు సంక్రాంతి హీరోలు కలిసి ఓ సినిమా చేయబోతున్నారట. ధమాకా రైటర్ ప్రసన్నకుమార్ బెజవాడ రవితేజ, నవీన్ పొలిశెట్టి కోసం ఓ కథను సిద్దం చేసి వారికి వినిపించగా.. ఇద్దరూ స్క్రిప్ట్‌కు బాగా కనెక్ట్ అయ్యారని ఇన్‌సైడ్ టాక్. ఎక్కడికి పోతావు చిన్నవాడా, నా సామి రంగా, నేను లోకల్, దాస్ కా ధమ్‌కీతోపాటు పలు చిత్రాలకు డైలాగ్స్ అందించాడు ప్రసన్న కుమార్ బెజవాడ. రవితేజ, నవీన్ పొలిశెట్టిలో కామిక్ టైమింగ్ విషయానికొస్తే ఎవరి స్టైల్ వారిదే. మరి అంతా అనుకున్నట్టు కుదిరితే రవితేజ, నవీన్ పొలిశెట్టి కాంబినేషన్ సిల్వర్ స్క్రీన్‌పై మ్యాజిక్ చేయడం పక్కా అని చెప్పొచ్చు. మరి ఈ క్రేజీ కాంబోపై రానున్న రోజుల్లో అధికారిక ప్రకటన ఏమైనా వస్తుందనేది చూడాలి. మరి ఈ ఇద్దరిని డైరెక్ట్ చేసేది ఎవరనేది ఆసక్తికరంగా మారింది.

# దాదాసాహెబ్ ఫాల్కే సలహా బోర్డ్ సభ్యురాలిగా సుధారెడ్డి



దాదా సాహెబ్ ఫాల్కే అంతర్జాతీయ చలనచిత్రోత్సవం సలహా బోర్డ్ సభ్యురాలిగా ప్రముఖ వ్యాపారవేత్త, సాంస్కృతిక రాయబారి సుధారెడ్డిని నియమితులయ్యారు. ఈమె కాకుండా బోర్డ్‌లో హిందూజా గ్రూప్ వైస్ ప్రెసిడెంట్ కల్నల్ పి.సి. సూద్, బరోడా మహారాణి హెచ్.హెచ్. రాధికరాజే గైక్వాడ్, వి.ఎం. సల్గావ్కార్ కార్పొరేషన్ చైర్మన్ దత్తరాజ్ సల్గావ్కార్, ఇండియన్ ఫ్యాషన్ డిజైనర్ మనీష్ మల్హోత్రా, ఇండియన్ కొరియోగ్రాఫర్ షియామక్ దావర్, దాదాసాహెబ్ ఫాల్కే ముని మనవరాలు గిరిజా ఫాల్కే మరాఠే, ఇన్ఫర్మేషన్ % a% బ్రాడ్‌కాస్టింగ్ మంత్రిత్వ శాఖలో గౌరవనీయ సాంస్కృతిక నిపుణుడు %a% మాజీ సెన్సార్ బోర్డు జ్యూరీ భావనా మర్చంట్, సినీపోలిస్ ఇండియా ఫిల్మ్ ప్రోగ్రామింగ్ %a%డిస్ట్రిబ్యూషన్ హెడ్ మయాంక్ ష్రాఫ్ మరియు భారత ప్రభుత్వ ఇన్ఫర్మేషన్ %a% బ్రాడ్‌కాస్టింగ్ మంత్రిత్వ శాఖలో క్రియేటివ్ ప్రొడ్యూసర్ %a% మాజీ సెన్సార్ బోర్డు జ్యూరీ జ్యోతి బధేకా తదితరులు ఉన్నారు. భారతీయ సినిమా పితామహుడు దాదాసాహెబ్ ఫాల్కే వారసత్వంలో డీపీఐఎఫ్‌ఎఫ్ సలహా బోర్డ్.. సాంస్కృతిక ప్రతిష్టకు నిలయంగా ఉద్భవించింది. కళాకారులు, చిత్రనిర్మాతలు, పరిశ్రమ నాయకులను నిరంతరం గౌరవిస్తూనే సినిమా రంగంలో ప్రపంచ కేంద్రంగా భారతదేశం యొక్క స్థాయిని బలోపేతం చేస్తుంది. ఇకపోతే అక్టోబరు 29-30వ తేదీల్లో ముంబై వేదికగా దాదాసాహెబ్ ఫాల్కే అంతర్జాతీయ చలనచిత్రోత్సవ అవార్డులు-2025 కార్యక్రమం జరగనుంది.

# 10 రోజుల్లో రూ. 55 కోట్లు.. బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతున్న ధ్రువ్ విక్రమ్ 'బైసన్'




తమిళ అగ్ర నటుడు విక్రమ్ తనయుడు ధ్రువ్ విక్రమ్ ప్రధాన పాత్రలో నటించిన 'బైసన్' చిత్రం బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతుంది. ఈ చిత్రం విడుదలైన 10 రోజుల్లోనే రూ.55 కోట్ల వసూళ్లను రాబట్టినట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ విషయాన్ని చిత్ర దర్శకుడు మారి సెల్వరాజ్ తెలుపుతూ.. బైసన్ రన్ ఇంకా కొనసాగుతుంది. మీ అందరి ప్రేమకు ధన్యవాదాలు అంటూ రాసుకొచ్చాడు. ఈ సినిమాకు పాజిటివ్ టాక్ రావడంతో రెండో వారంలో ఈ చిత్రానికి భారీగా స్క్రీన్స్ పెరిగాయి. ముఖ్యంగా తమిళనాడు, కర్ణాటక, కేరళలో థియేటర్‌లు పెరగడంతో మంచి కలెక్షన్లు రాబడుతుంది ఈ చిత్రం. ధ్రువ్ విక్రమ్, అనుపమా పరమేశ్వరన్ జోడీగా నటించిన ఈ సినిమాకు మారి సెల్వరాజ్ దర్శకత్వం వహించాడు. ఈ సినిమాను పా.రంజిత్ నీలం ప్రొడక్షన్స్, అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్, శాంతి సినిమాస్ బ్యానర్‌లు సంయుక్తంగా నిర్మించాయి. పశుపతి, రజిషా విజయన్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రలో నటించారు.

# అల్లు అర్జున్- అట్లీ మూవీ.. హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్



పుష్ప -2 బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత అల్లు అర్జున్ మరో భారీ బడ్జెట్ ప్రాజెక్ట్‌లో నటిస్తున్నారు. కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీతో ఆయన జతకట్టారు. వీరిద్దరి కాంబోలో తొలిసారి వస్తోన్న సైన్స్ ఫిక్షన్ యాక్షన్ మూవీపై అభిమానుల్లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. అయితే ఈ సినిమాలో హీరోయిన్ ఎవరనే దానిపై కొన్ని నెలలుగా చర్చ నడుస్తూనే ఉంది. ఇప్పటికే ఈ మూవీలో బాలీవుడ్ భామ దీపికా పదుకొణెను ఎంపిక చేసినట్లు వార్తలొచ్చాయి. అంతే కాకుండా మరో ముగ్గురు రష్మిక, జాన్వీ కపూర్, మృణాల్ ఠాకూర్ కూడా నటిస్తున్నారని టాక్ నడిచింది. ఈ నేపథ్యంలోనే తాజాగా హీరోయిన్‌కు సంబంధించిన మరో వార్త నెట్టింట చక్కర్లు కొడుతోంది. ఈ భారీ ప్రాజెక్ట్‌లో సీతారామం బ్యూటీ హీరోయిన్‌గా కన్‌ఫామ్ అయినట్లు సోషల్ మీడియాలో టాక్ వినిపిస్తోంది. ఇప్పటికే మృణాల్ షూట్‌లో కూడా పాల్గొన్నారని లేటేస్ట్ అప్‌డేట్. అంతేకాకుండా అల్లు అర్జున్‌తో కీలక సన్నివేశాలు షూట్ చేసినట్లు తెలుస్తోంది. ఈ కాంబోలో మృణాల్ ఎంట్రీలో మూవీపై మరింత బజ్ ఏర్పడింది. ఇప్పటికే ఈ సినిమాకు హాలీవుడ్ టచ్ ఇచ్చేందుకు మేకర్స్ రెడీ అయ్యారు. ఈ మూవీలో హాలీవుడ్ హీరో విల్ స్మిత్ సైతం నటిస్తున్నట్లు కూడా వార్తలొచ్చాయి. అంతర్జాతీయ మార్కెట్‌ను టార్గెట్ చేస్తూ మరికొందరిని హాలీవుడ్ పరిశ్రమకు చెందిన నటీనటులను ఈ మూవీ కోసం తీసుకోనున్నట్లు తెలిసింది. ఈ సినిమాను దాదాపు రూ. 800 కోట్ల బడ్జెట్‌తో సన్ పిక్చర్స్ అధినేత కళానిధి మారన్ నిర్మిస్తోన్న సంగతి తెలిసిందే.




# ఈ సారి మామూలుగా ఉండదు'.. డకాయిట్ కొత్త రిలీజ్ డేట్

టాలీవుడ్ హీరో అడివి శేష్, మృణాల్ ఠాకూర్ జంటగా నటిస్తోన్న ఇంటెన్స్ యాక్షన్ ప్రేమకథా చిత్రం డకాయిట్ ఇప్పటికే రిలీజ్ తేదీ ప్రకటించినా అనివార్య కారణాలతో వాయిదా పడుతూనే వస్తోంది. గతంలో ఈ ప్రాజెక్ట్ నుంచి కోలీవుడ్ భామ శృతిహాసన్ అనూహ్యంగా తప్పుకుంది. ఇది కూడా సినిమా ఆలస్యానికి కారణం కావొచ్చని తెలుస్తోంది. ఆ తర్వాత సీతారామం బ్యూటీ మృణాల్ ఠాకూర్ ఈ మూవీలో హీరోయిన్‌గా చేస్తోంది. మొదట ఈ చిత్రాన్ని డిసెంబర్ 25న క్రిస్మస్ సందర్భంగా రిలీజ్ చేస్తామని మేకర్స్ ప్రకటించారు. కానీ వారు అనుకున్న తేదీ ప్రకారం కుదరకపోవడంతో తాజాగా కొత్త విడుదల తేదీని ప్రకటించారు డకాయిట్ మేకర్స్. వచ్చే ఏడాది ఉగాది కానుకగా డకాయిట్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు ప్రకటించారు. 'ఈ సారి మామూలుగా ఉండదు.. వెనక్కి తిరిగి చూసేదే లేదు' అంటూ అడివి శేష్ మూవీ పోస్టర్‌ను పంచుకున్నారు. వచ్చే ఏడాది మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో డకాయిట్ సందడి చేయనుందని ట్విటర్‌లో పోస్ట్ చేశారు. దీంతో అడివి శేష్ ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు. ఈ మూవీని షానీల్ డియో దర్శకత్వంలో తెరకెక్కిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ తెలుగు, హిందీ భాషల్లో ఈ చిత్రం నిర్మిస్తున్నారు. అడివి శేష్ నటించిన 'క్షణం', గూఢచారితో సహా పలు తెలుగు సినిమాలకు కెమెరామేన్‌గా చేసిన షానీల్ డియో ఈ మూవీతో డైరెక్టర్‌గా పరిచయం అవుతున్నారు. ఈ సినిమాలో బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్నారు. కాగా.. ఇప్పటికే ఈ మూవీ గ్లింప్స్ రిలీజ్ చేయగా ఆడియన్స్‌ను ఆకట్టుకుంది.

Ediited Printed & Published Mekkonda Premraj on behalf MPR publications and Printed RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,